నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
గుంటూరు పల్నాడు
శుక్రవారం 30 జనవరి 2026 - పేజీలు 8



## జీఎస్టీ వసూళ్లకు అన్ని ప్రభుత్వ శాఖలు

# సహకారం అందించాలి

కలెక్టర్
ఏ తమీమ్ అన్సారియా



జిల్లాలో జీఎస్టీ సమర్థవంతంగా వసూలు చేసేందుకు ప్రతినెల సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ శాఖలలో పనుల టెండర్లలో జీఎస్టీ లో నమోదైన సంస్థలు మాత్రమే పాల్గొనేలా అధికారులు పర్యక్షించాలన్నారు.

**గుంటూరు, కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** జిల్లాలో జీఎస్టీ వసూలు సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖలు నిర్దేశిత మార్గదర్శకాలు ప్రకారం వాణిజ్య పన్నుల శాఖకు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా తెలిపారు. గురువారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా జిల్లా లో జీఎస్టీ సమర్థవంతంగా అమలుపై వాణిజ్య పన్నులు, రెవిన్యూ, పోలీస్, మున్సిపల్, పంచాయతీ, ఇంజనీరింగ్, విద్యా, పరిశ్రమలు తదితర శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పనులు నిర్వహించిన సంస్థలకు బిల్లులు మంజూరు సమయంలో జీఎస్టీ చెల్లింపులను పరిశీలించాలన్నారు. జీఎస్టీ చెల్లింపులలో అవకతవకలకు పాల్పడిన వారిపై కేసులు నమోదుకు వాణిజ్య

02 పేజీ



## వివిఐటీయూలో యుఫోరియా చిత్ర బృందం సందడి

**పెదకాకాని మేజర్ న్యూస్ :** భూమిక చావ్లా, సారా అర్జున్ ప్రధాన పాత్రలలో ప్రముఖ దర్శకుడు గుణశేఖర్ దర్శకత్వంలో రూపొందించబడిన యూత్ ఒరియంటెడ్ సోషల్ ఫాంటసీ చిత్రం యుఫోరియా ఈ చిత్రం ఫిబ్రవరి 6న విడుదల కానున్న

2 లో

## అట్టహాసంగా వ్యవసాయ ఎగ్జిబిషన్ ప్రారంభం



- వ్యవసాయ అనుబంధ ఉత్పత్తులతో స్టాల్స్ ఏర్పాటు

**గుంటూరు జిల్లా పరిషత్ మేజర్ న్యూస్ :** గుంటూరులో అఖిల భారత కిసాన్ సభ జాతీయ కౌన్సిల్ సమావేశాల సందర్భంగా మొదటి రోజు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో వ్యవసాయ అనుబంధ ఉత్పత్తుల ఎగ్జిబిషన్ అట్టహాసంగా ప్రారంభమైంది. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆర్. శారదా జయలక్ష్మి రిబ్బన్ కట్చేసి ఎగ్జిబిషన్ ప్రారంభించారు. ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజు కృష్ణన్, ఆహ్వాన సంఘం అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి. కృష్ణయ్య, కె. ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అతిథులకు రైతులు బొకేలు అందజేసి

వివరాలు 2 లో



## బాల్య వివాహ విముక్తి రథాన్ని ప్రారంభించిన కలెక్టర్

**గుంటూరు, కలెక్టరేట్ మేజర్ న్యూస్:** బాల్య వివాహ విముక్తి రథాన్ని కలెక్టర్ కార్యాలయం వద్ద జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా గురువారం ప్రారంభించారు. భారత ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న బాల్య వివాహ ముక్త భారత్ కార్యక్రమంలో

2 లో

## అంబరాన్నంటిన పాతికేళ్ల సిబార్ సంబరం





- వైభవంగా సిబార్ 25వ రజతోత్సవం
- ఎన్నో అవార్డులు రివార్డులతో కొనసాగిన పాతికేళ్ల ప్రయాణం
- ఫ్యూచర్ రెడీ విద్యార్థులను తయారు చేసే కర్మాగారం సిబార్

**పెదకాకాని మేజర్ న్యూస్ :** పెదకాకాని మండలం తక్కెళ్ళపాడు గ్రామంలో ఉన్న సిబార్ దంత వైద్య కళాశాల 25 వ రజతోత్సవం అత్యంత వైభవంగా జరిగింది విద్యార్థుల సంబరాలు అంబరాన్ని అంటాయి మొదటగా కళాశాల డీన్ డాక్టర్ ఎల్ కృష్ణ ప్రసాద్ సభను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ కళాశాలలో విద్యార్థిని విద్యార్థులకు దంత వైద్యంలో ఉన్నతమైన విధివిధానాలు నేర్చుకొనుటకై అవసరం అయిన అన్ని అత్యాధునిక సౌకర్యములు కల్పించడం జరిగినదని చెప్పారు. ఈ సందర్భంగా తక్కెళ్ళపాడు గ్రామంలో ఈ కాలేజీని నెలకొల్పి గత 25

మిగతా 2

# అంబరాన్నంటిన పాతికేళ్ల సిబార్ సంబరం



మొదటి పేజీ తరువాయి

సంవత్సరాలుగా దిగ్విజయంగా నడిపించుటకు దోహదపడిన తక్కెళ్ళపాడు గ్రామ పెద్దలు మరియు ప్రజానీకం అందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ రోజు మన సంస్థ సిబార్ దంత వైద్య కళాశాల 25 ఏళ్ల ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తి చేసుకుని రజతోత్సవం సిల్వర్ జూబ్లీ జరుపుకోవడం చాలా ఆనందంగా ఉంది. తొలుత చిన్నగా మొదలైన ఈ ప్రయాణం, మీ అందరి కృషి, పట్టుదల వల్ల ఈ రోజు ఇంత పెద్ద ఎత్తున ఎదిగిందన్నారు ఆ గడిచిన ఇరవై ఐదు ఏళ్లలో అనేక సవాళ్లను ఎదుర్కొన్నాము, ఎన్నో విజయాలను సాధించాము. నాటి నుండి నేటి వరకు సంస్థ అభివృద్ధి కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. మన లక్ష్యాల వైపు అడుగులు వేస్తూ, మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశిస్తున్నాను అని అన్నారు మనందరి ఉమ్మడి కృషి ఇలాగే కొనసాగాలని, భవిష్యత్తులో మరిన్ని రజతోత్సవాలు జరుపుకోవాలని కోరుకుంటూ, ఈ ప్రత్యేక సందర్భంలో నాతో పంచుకున్నందుకు మీ అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నట్లు తెలిపారు 25వ రజతోత్సవ వార్షికోత్సవ కార్యక్రమానికి నేషనల్ డెంటల్ అసోసియేషన్ గౌరవ కార్యదర్శి డాక్టర్ అశోక్ దోబ్లే ముఖ్య అతిథిగా విచ్చేశారు. సిబార్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రెసిడెంట్ డాక్టర్ ముక్కామల అప్పారావు సభకు అధ్యక్షత వహించారు. విశిష్ట అతిథులుగా భారత దంత వైద్య మండలి మెంబర్ డాక్టర్ పి. రేవతి అమెరికా నుండి విచ్చేసిన ఇంటర్నేషనల్ ఫ్యాకల్టీ డాక్టర్ మురళీధర్ ముప్పరపు పాల్గొన్నారు. గవర్నింగ్ బాడీ మెంబర్స్ అయిన డాక్టర్ లింగమనేని సుబ్బారావు డాక్టర్ సునీల్, శ్రీ నివాస్ కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ టి. కృష్ణమోహన్, ప్రిన్సిపల్ డాక్టర్ వెంకట రమణారెడ్డి, వేదికను అలంకరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమణారెడ్డి మాట్లాడుతూ గత 25 సంవత్సరాలలో సిబార్ దంత వైద్య కళాశాల ఎదిగిన విధానం మరియు సాధించిన ఘనతలను గురించిన నివేదికను వివరంగా సమర్పించారు. డాక్టర్ ముక్కామల అప్పారావు మాట్లాడుతూ ఈ కాలేజీ ఇప్పటి దాకా సాధించిన ఘనతలన్నీ మొదటినుంచి తమతో ప్రయాణించిన మరియు ఇప్పుడు వచ్చిన కొత్త తరం అధ్యాపకులు మరియు విద్యార్థిని విద్యార్థులు అందరి సమీకృత కృషి వలనే సాధ్యమైనదని అన్నారు. ప్రత్యేక అతిధి డాక్టర్ అశోక్ దోబ్లే మాట్లాడుతూ ఇచ్చట అభ్యసిస్తున్న విద్యార్థిని విద్యార్థులందరూ ఇటువంటి అద్భుతమైన కళాశాలలో విద్య నేర్చుకోవటం ఒక మంచి అవకాశం అని... ఫ్యూచర్ రెడీ విద్యార్థులను తయారు చేస్తున్నందుకు సిబార్ కళాశాల యాజమాన్యాన్ని, ఉపాధ్యాయులను మెచ్చుకున్నారు. ఇప్పటి విద్యార్థులకు మారుతున్న పరిస్థితుల దృష్ట్యా ముందు ముందు ఎంతో బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉన్నదని ఆయన అన్నారు. సమాజంలో ఉత్తమ దంత వైద్యులుగా ఎదుగుతూ సామాజిక స్పృహ కలిగి ఎంతో కొంత సేవాభావంతో కూడా పని చేయాలని కాంక్షించారు. ఈ సందర్భంగా కళాశాలలోని 25 సంవత్సరాల ఘనతలను ఊటంకిస్తూ తయారుచేసిన ఒక అద్భుతమైన సావేనీర్ ను అతిథులు విడుదల చేశారు. తరువాత కార్యక్రమంలో ఉన్నత ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులకు బంగారు పతకాలు అందజేశారు. అలాగే సిల్వర్ జూబిలీ వార్షికోత్సవం కావున ఉత్తమ ప్రతిభ కనబరచి ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులకు హాస్పటల్ లోని వివిధ బోధనేతర సిబ్బందికి యాజమాన్యం వారు సత్కరించిమెమెంటోళ్లను అందజేశారు ఈ సందర్భంగా కళాశాలలోని అధ్యాపకులు మరియు విద్యార్థిని విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఫ్యాషన్ షో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెదకాకాని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ ఉప్పలపాడు గ్రామ సర్పంచ్ కర్నాటి శ్రీనివాసరావు ఉపసర్పంచ్ బూసి బాబు తెలుగు యువత నాయకులు పెండ్యాల సురేష్ తోపాటు ఎంతోమంది విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కళాశాలలోని అధ్యాపకులు పాల్గొన్నారు.

## వివిఐటియూలో యుఫోరియా

# చిత్ర బృందం సందడి

మొదటి పేజీ తరువాయి

నేపథ్యంలో చిత్రబృందం ప్రచార కార్యక్రమంలో భాగంగా వివిఐటి విశ్వవిద్యాలయాన్ని సందర్శించింది. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డావ వై. మల్లికార్జున రెడ్డి, డైరెక్టర్ గుణశేఖర్, చిత్ర నటీనటులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్శకుడు గుణశేఖర్ మాట్లాడుతూ యువతలో డ్రగ్స్ కల్చర్, టీనేజ్ సమస్యల నేపథ్యంలో ఈ చిత్ర కథ రూపొందించబడిందని తెలిపారు. కమెర్షియల్ ఫార్మట్లో అలరిస్తూనే ఈ చిత్రం సందేశాన్ని అందిస్తుందని అన్నారు. కుటుంబ సమేతంగా చూడదగ్గ ఈ చిత్రం ఖచ్చితంగా విజయం సాధిస్తుందన్న నమ్మకం ఉందన్న అశాభావం వ్యక్తం చేశారు. అనంతరం బృందం విద్యార్థులతో కలసి నృత్యాలు, సెల్ఫీలతో సందడి చేశారు.

## బాల్య వివాహ విముక్తి రథాన్ని

# ప్రారంభించిన కలెక్టర్

మొదటి పేజీ తరువాయి

భాగంగా గుంటూరు జిల్లాలో క్రాఫ్ రూపొందించిన బాల్య వివాహ విముక్తి రథాన్ని జండా ఊపి ప్రారంభించారు. ఈ విముక్తి రథం జిల్లాలోని అన్ని మండలాలలో ప్రజలకు బాల్య వివాహానికి వ్యతిరేకంగా ప్రచారం కల్పించడంలో ఉపయోగపడుతుందని చెప్పారు. తద్వారా ప్రజలు బాల్యవివాహాలకు వ్యతిరేకంగా, ప్రభుత్వానికి అధికారులకి సహకరించి 1098, 112 టోల్ ఫ్రీ నంబర్ లకు, పోలీస్ టోల్ ఫ్రీ నంబర్ నెంబరు 100 కు తెలియజేయవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ పథక సంచాలకులు పి.పి.జి. ప్రసూన చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ ట్రస్ట్ స్టేట్ ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్.పి. ఫ్రాన్సిస్ తంబీ, అసోసియేషన్ ఫర్ వాలంటరీ యాక్షన్, రాష్ట్ర ప్రతినిధి జీ. తిరుపతిరావు, సునీల్ కుమార్, క్రాఫ్ జిల్లా కోఆర్డినేటర్లు కోలా సమీర్ కుమార్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ వెంకయ్య, క్రాఫ్ సిబ్బంది పద్మజ మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జీఎస్టీ వసూళ్లకు అన్ని ప్రభుత్వ శాఖలు

# సహకారం అందించాలి

మొదటి పేజీ తరువాయి

పన్నుల శాఖ కు పోలీస్ శాఖ అధికారులు సహకారం అందించాలన్నారు. మొండి బకాయిదారుల నుంచి నగదువసూలుకు రెవెన్యూ రికవరీ యాక్ట్ అమలుకు రెవిన్యూ శాఖ చర్యలు తీసుకోవాలని సూచించారు. వాణిజ్య పన్నుల శాఖకు వివిధ శాఖలలో అవసరమైన పూర్తి సమాచారాన్ని వెంటనే అందించాలన్నారు. ప్రభుత్వ శాఖలలో ప్రస్తుతం కొనసాగుతున్న పనుల వివరాలను నిర్దేశించిన ఫార్మేట్లో అందించాలన్నారు.వాణిజ్య పన్నుల శాఖ గుంటూరు డివిజన్ జాయింట్ కమిషనర్ బి గీతామాధురి జిల్లాలో జీఎస్టీ కి సంబంధించి వివిధ శాఖలు అందించాల్సిన సమాచారం గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కే ఖాజావలి, జిల్లా పంచాయతీ అధికారి సాయికుమార్, హౌసింగ్ పీడీ ప్రసాదు, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, జిల్లా విద్యాశాఖ అధికారి సలీం భాషా, ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్ఈ కళ్యాణ చక్రవర్తి, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జయలక్ష్మి,, ఇరిగేషన్ ఎస్ఈ వెంకటరత్నం, ఆర్ అండ్ బీ డెప్యూటీ ఎస్ఈ హజరతయ్య, పీఆర్ ఎస్ఈ శ్రీనివాసులు, తెనాలి మున్సిపల్ కమిషనర్ జెఆర్ అప్పలనాయుడు,జిల్లా జీఎస్ డబ్ల్యుఎస్ అధికారి సీహెచ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా వ్యవసాయ ఎగ్జిబిషన్ ప్రారంభం

మొదటి పేజీ తరువాయి

ఎగ్జిబిషన్కు స్వాగతం పలికారు. విసి శారద జయలక్ష్మి, విజుకృష్ణన్, ఇతర నాయకులు అన్ని స్టాల్స్ ను పరిశీలించి ఉత్పత్తులు వాటి ఉపయోగాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎగ్జిబిషన్ తిలకించేందుకు గుంటూరు, పల్నాడు జిల్లాల నుండి రైతులు, మహిళా రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వ్యవసాయ అనుబంధ ఉత్పత్తులతోపాటు, వివిధ పాఠశాలలు, కళాశాల విద్యార్థులు రైతుల కోసం రూపొందించిన నమూనాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అలాగే లలిత హాస్పిటల్ వారు ఏర్పాటు చేసిన వైద్య పరీక్షల స్టాల్ లో ఉచిత బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ప్రజాశక్తి పుస్తక ప్రదర్శన స్టాల్స్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్లు ఎన్ వేణుగోపాల్, రావూరి వీర రాఘవయ్య, కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరిబాబు తదితరులు పాల్గొన్నారు

# జనాభా లెక్కల సేకరణ-2027పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి: సిఎస్



**గుంటూరు, కలెక్టరేట్ మేజర్ న్యూస్:** జనాభా లెక్కల సేకరణ 2027పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ కలక్టర్లకు స్పష్టం చేశారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ రానున్న 2027 జనాభా లెక్కల సేకరణ,175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఇ పార్కులు ఏర్పాటు,డిస్పెన్సరీలు,ఐఎంఎస్ ఆసుపత్రుల నిర్మాణానికి భూమి కేటాయింపు, పాజిటివ్ పబ్లిక్ పెరసెప్షన్ అంశాలపై జిల్లా కలక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ 2027 జనాభా లెక్కల సేకరణ సన్నాహక ఏర్పాట్లపై మాట్లాడుతూ జనాభా లెక్కల సేకరణ ప్రక్రియ సక్రమంగా సజావుగా నిర్వహించేందుకు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆదిశగా కలక్టర్లు తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు.ఇందుకు సంబంధించి ఇప్పటికే రాష్ట్ర సెన్సస్ డైరెక్టర్ తగిన మార్గదర్శకాలను జారీ చేయడం జరిగిందని వాటిని తుచ తప్పక పాటించి రానున్న జనాభా లెక్కల సేకరణ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని కలక్టర్లకు స్పష్టం చేశారు.జనాభా లెక్కల సేకరణ-2027పై ప్రజల్లో అవగాహనకు ప్రత్యేక ఐఇసి మెటీరియల్ ను ప్రచురించి అన్ని జిల్లాలకు పంపాలని రాష్ట్ర సెన్సస్ డెరెక్టర్ జె.నివాస్ ను సిఎస్ విజయానంద్ ఆదేశించారు.అదేవిధంగా రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 175 ఎంఎస్ఎంఇ పార్కులు ఏర్పాటు ప్రక్రియ ప్రగతిని డిస్పెన్సరీలు,ఐఎంఎస్ ఆసుపత్రుల నిర్మాణానికి భూమి కేటాయింపు తదితర అంశాలపై సమీక్షించి, జిల్లా కలెక్టర్లకు సూచనలు జారీ చేశారు. వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుంచి పాల్గొన్న జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో




ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు కు అవసరమైన స్థలాల సేకరణకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ కు వివరించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కే ఖాజావలి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా లూయి బ్రెయిలి జయంతి వేడుకలు

## - అందుల జీవితాల్లో వెలుగులు నింపిన లూయి బ్రెయిలీ ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు






**నరసరావుపేట మేజర్ న్యూస్ :** అందుల జీవితాల్లో లూయి బ్రెయిలీ వెలుగులు నింపారని నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు తెలిపారు. నరసరావుపేట పట్టణంలోని లూయి బ్రెయిలి అంధుల పాఠశాలలో గురువారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం, లూయి బ్రెయిలి 217వ జయంతి వేడుకలను గురువా రం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నరసరావుపేట శాసన సభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట కోటేశ్వరరావు హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు మాట్లాడుతూ దృష్టి లోపం ఉన్నప్పటికీ విద్య ద్వారా ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని లూయి బ్రెయిలి జీవితం మనకు ఆదర్శమని తెలిపారు. విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, విద్యా సహాయ కార్యక్రమాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులకు సూచించారు. నరసరావుపేట పట్టణంలోని లూయి బ్రెయిలీ అందుల పాఠ శాలలో మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు హామీ ఇచ్చారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట కోటేశ్వరరావు మాట్లాడుతూ బ్రెయిలి లిపి ద్వారా అంధులకు జ్ఞాన ద్వారాలు తెరుచుకున్నాయని, ప్రభుత్వం గ్రంథాలయాల ద్వారా కూడా ప్రత్యేక అవసరాలున్న విద్యా ర్థులకు చదువు అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మహిళా బాలల గ్రంథాలయం ఆకస్మిక తనిఖీ



**తెనాలి, మేజర్ న్యూస్ :** స్థానిక కొత్తపేటలోని మహిళా బాలల గ్రంథాలయాన్ని రాష్ట్ర పౌర గ్రంథాలయ సంచాలకులు ఆకేపాటి కృష్ణమోహన్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. పత్రికా విభాగం, పుస్తక విభాగం, డిజిటల్ విభాగంను సందర్శించి, పలు రికార్డులను పరిశీలించారు. గ్రంథాలయాధికారిణి కడియాల సుజాత కి పలు సూచనలు చేశారు. గ్రంథాలయ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రంథాల సంచాలకులు కృష్ణమోహన్ మాట్లాడుతూ గ్రంథాలయానికి చిన్న పిల్లలు, ప్రజలు ఎక్కువ మంది వచ్చే విధంగా ప్రోత్సహించాలన్నారు. గ్రంథాలయంలో అవసరమైన అన్ని పుస్తకాలు అందుబాటులో ఉండే విధంగా చూడాలని, గ్రంథాలయానికి వచ్చే వారికి ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. పిల్లలు పుస్తక పఠన అలవాటు చేసుకుంటే ఉన్నత స్థానాన్ని అధిరోహిస్తారని చిన్నారులకు చిన్ననాటి నుండే పుస్తక పఠన వ అలవాటు చేయాలని ఆయన సూచించారు.

## నూతక్కి -గుండి మెడ డొంకరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

**మంగళగిరి, మేజర్ న్యూస్:** నియోజకవర్గం లోని నూతక్కి నుండి గుండి మెడ గ్రామానికి చేరుకునే డొంక రోడ్డు నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. రూ. 19 లక్షలు అంచనా వ్యయంతో ఈ పనులను చేపట్టారు. డొంక రోడ్డు నిర్మాణంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ టిడిపి నాయకులు రంగిశెట్టి నరేంద్ర (బాబి) సొసైటీ ప్రెసిడెంట్ టిడిపి నాయకులు వల్లూరి వెంకటేశ్వరరావు, పార్టీ నూతక్కి గ్రామ ఉపాధ్యక్షులు వల్లూరి సూర్య లక్ష్మీనారాయణ, గుంటూరు సుధీర్, రాచర్ల సురేష్, బి రమేష్ మేడిశెట్టి కిషోర్ పాల్గొన్నారు.



## విజ్ఞాన్స్ యూనివర్సిటీ విద్యార్థినికి పీహెచ్‌డీ పట్టా



**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్:** చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అప్లైడ్ సైన్సెస్ అండ్ హ్యుమానిటీస్ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీకి చెందిన షేక్ షాజియా అఫ్రీన్ అనే విద్యార్థినికు గురువారం యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేసినట్లు ఇంచార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిషోర్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిషోర్ మాట్లాడుతూ, షేక్ షాజియా అఫ్రీన్ "ఎక్స్‌ప్లోరింగ్ అడ్సార్ప్షన్ ప్రాసెస్: ఫ్రమ్ అల్యూమినోసిలికేట్ బేస్డ్ నానోక్లేస్ ఫర్ క్యాటయానిక్ డై రిమూవల్ టు ఎగ్‌షెల్ డెరైవ్డ్ అడ్సార్బెంట్ ఫర్ డ్రగ్ అడ్సార్ప్షన్" అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ డిగ్రీని సాధించారని తెలిపారు. ఈ పరిశోధనకు విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీకి విభాగానికి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆనంద్‌రూప్ గోస్వామి గైడ్‌గా వ్యవహరించారని తెలిపారు. అనంతరం పీహెచ్‌డీ పట్టా పొందిన షేక్ షాజియా అఫ్రీన్‌ను విజ్ఞాన్స్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, వివిధ విభాగాల డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు అభినందించారు.



## స్పర్శ లెప్రసీ అవేర్నేస్ క్యాంపెయిన్ పోస్టర్ ఆవిష్కరణ

**గుంటూరు, కలెక్టరేట్ మేజర్ న్యూస్:** కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా స్పర్శ లెప్రసీ అవేర్నేస్ క్యాంపెయిన్ పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ "వివక్షతను అంతం చేయడం గౌరవాన్ని కాపాడటం" అనే థీంతో జనవరి 30, 2026 నుండి ఫిబ్రవరి 13, 2026 వరకు జరిగే "స్పర్శ" లెప్రసి అవగాహన కార్యక్రమాలు జిల్లాలో నిర్దేశిత మార్గదర్శకాలు ప్రకారం సక్రమంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి డీఎంహెచ్ఓ డా. శ్రావణ్ బాబు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు చెన్నయ్య, డీపీఎంఓ డా. కె సుజాత, డీఎన్ఎంఓ డా. ఎన్ అనూహ్య, జిల్లా లెప్రసీ కార్యాలయం అధికారులు పాల్గొన్నారు.

## నగరంలోని పలు పాఠశాలలో
# డీఈఓ ఆకస్మిక తనిఖీలు



**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్:** గుంటూరు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ సలీం భాష గుంటూరు నగరంలోని కె ఎస్ ఆర్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల, అదే ప్రాంగణంలో ఉన్న ప్రాథమిక పాఠశాల, హిందూ కాలేజ్ హై స్కూల్ , యాదవ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నల్లపాడు లను ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలు, పదో తరగతి విద్యార్థులకు జరుగుతున్న 100 రోజుల ప్రణాళిక అమలు తీరును, 9వ తరగతి విద్యార్థుల సిలబస్ పరిశీలించారు ఆయా పాఠశాలల లో వచ్చే విద్యా సంవత్సరానికి విద్యార్థుల నమోదు పెంచేందుకు ఇప్పటినుండే గ్రామస్తులు,తల్లిదండ్రుల సహకారంతో తమ క్యాచ్ మెంట్ ఏరియాలో ఉన్న విద్యార్థులందరినీ తమ పాఠశాలలో చేరే విధంగా ప్రణాళిక ఏర్పరుచుకోవాలని, ప్రవేట్ పాఠశాలల కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉండే విధంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను కృషి చేయాలని అన్నారు. ఈ సందర్భంగా హిందూ కాలేజీ హైస్కూల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్నబడి భోజనమును పరిశీలించారు ఈ సందర్భంగా వారు కోడిగుడ్లు, చిక్కిలను పరిశీలించి వాటిపై ఉన్న గడువును ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పరిశీలించుకోవాలని నాణ్యత విషయంలో రాజీ పడవద్దని సలీం భాష అన్నారు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి నూరు శాతం జి ఎఫ్ ఎల్ ఎన్ సాధించాలని అన్నారు.

# శ్రీవారి లడ్డుని కల్తీ చేయడం మహాపాపం

## ఎమ్మెల్యే బూర్ల



**గుంటూరు రూరల్, మేజర్ న్యూస్:** వైకాపా హయాంలో తిరుమల తిరుపతి దేవస్థానంలో కల్తీ నెయ్యిని ఉపయోగించి, శ్రీవారి లడ్డు ప్రసాదం తయారీలో వినియోగించారని సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన సిట్ నిగ్గు తేల్చి, నిర్ధారించడంతో గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలోని,46వ డివిజన్,గోరంట్ల, అమరావతి రోడ్డు నందు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవాలయాన్నీ ఎమ్మెల్యే బి ఆంజనే బూర్ల రామాంజనేయులు శుద్ధిచేసి, పూజ కార్యక్రమాలను నిర్వహించినారు. అనంతరం స్వామివారి దేవాలయం నుండి చిల్లీస్ సెంటర్ వరకు జరిగిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గతంలో మేము ప్రతిపక్షంలో ఉన్నప్పుడే తిరుపతిలో జరిగే కల్తీ లడ్డు వ్యవహారంపై అనుమానం వ్యక్తం చేసాం. నాడు మేము చెప్పినట్లుగానే, నేడు సుప్రీంకోర్టు ఆధ్వర్యంలోని సిట్ దర్యాప్తు నిగ్గు తేల్చింది. కనీసం చుక్క పాలు లేకుండా పూర్తిగా రసాయనలతో నెయ్యి తయారు చేసి కోట్లాది లడ్డులు సరఫరా చేశారు. ఇలాంటి అభూత ఇన్నోవేషన్ కు వైసిపి ముఠాకు నోబెల్ కెమిస్ట్రీ అవార్డు ఇవ్వాల్సిందే. తల్లిపాలు కూడా కల్తీ చేయగల దుర్మార్గులు ఈ వైసీపీ నేతలు అంటూ విమర్శించారు. వైసిపి ఐదేళ్ల పాలనలో మొత్తం 1.61 కోట్ల కిలోల నెయ్యి కొనుగోలు చేయగా, అందులో సుమారు 60 లక్షల కిలోల కల్తీ నెయ్యితో 20.01 కోట్ల శ్రీవారి లడ్డూలు, ఇతర ప్రసాదాలు తయారు చేయడం మహాపాపం. ఈ కుంభకోణం లో దాదాపు 230 కోట్ల రూపాయలు స్వామివారి నిధులను దుర్వినియోగం జరిగింది. టీటీడీ నిబంధనలను వైసీపీ ప్రభుత్వం కావాలనే మార్చి అర్హతలేని, విచిత్ర కంపెనీలకు టెండర్లు కట్టబెట్టి కల్తీ కి రహదారి వేసింది. వైసిపి ఫలానాలో హిందూ దేవాలయాలపై దాడులు, సంప్రదాయాలపై అవమానాలు, తిరుమల పవిత్రతను దెబ్బతీసే అనేక సంఘటనలు గత ప్రభుత్వ పాలనలో జరిగాయి. ఇప్పటికైనా కల్తీ చేసిన వారు తమ తప్పును తెలుసుకొని స్వామివారిని, భక్తులను, క్షమాపణ కోరాలని లేకపోతే వారి పాపానికి నిష్కృతి ఉండదు. కార్యక్రమంలో వడ్రాణం హరిబాబు, కూటమి నాయకులు,స్వామివారి భక్తులు, కార్పొరేటర్లు, అభిమానులు, కార్యకర్తలు, మహిళలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పక్షుల కేంద్రం అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయండి

## ఎమ్మెల్యే ధూళిపాళ్ళ





**పెదకాకాని మేజర్ న్యూస్:** పెదకాకాని మండలం ఉప్పలపాడు గ్రామంలో ఉన్న ప్రసిద్ధ పక్షుల కేంద్రాన్ని పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ జిల్లా అటవీ శాఖ అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ మాట్లాడుతూ, ఉప్పలపాడు పక్షుల కేంద్రం దేశ విదేశాల నుంచి వలస వచ్చే అనేక రకాల పక్షులకు ఆశ్రయంగా నిలుస్తోందని తెలిపారు. ముఖ్యంగా వివిధ జాతుల కొంగలు, అరుదైన వలస పక్షులు ఇక్కడికి చేరుతుండటంతో ఈ ప్రాంతం పర్యాటక ప్రాంతంగా ఎంతో ప్రాధాన్యం సంతరించుకుందని అన్నారు.రాష్ట్ర నలుమూలల నుంచి పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు, విద్యార్థులు ఈ పక్షుల కేంద్రాన్ని సందర్శిస్తున్నారని పేర్కొంటూ, వారికి మెరుగైన వసతులు కల్పించేలా కేంద్రాన్ని అభివృద్ధి చేయడానికి సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పక్షుల సంరక్షణతో పాటు పర్యాటకాభివృద్ధి కూడా కలగలిపి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెదకాకాని ఎంపీడీవో శ్రీనివాసరావు పెదకాకాని తహసిల్దార్ కృష్ణ కాంత్ పక్షుల కేంద్రం చైర్మన్ ఉట్టికూటి హరిబాబు ఉప్పలపాడు సొసైటీ చైర్మన్ మైలా సుబ్బారావు ఎంపీటీసీ మోపర్తి శ్రీను పెదకాకాని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వలివేటి మురళీకృష్ణ ఉప్పలపాడు గ్రామ సర్పంచ్ కర్నాటి శ్రీనివాసరావు ఉప్పలపాడు గ్రామ ఉపసర్పంచ్ బూసి బాబు పెదకాకాని మండల తెలుగుదేశం పార్టీ యువత మాజీ అధ్యక్షులు మోపర్తి సంజీవ్ కుమార్ ఇంకా పార్టీ నాయకులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.



# పలు వార్డుల్లో పర్యటించిన మున్సిపల్ కమిషనర్ ఎం. రమేష్ బాబు

**పొన్నూరు, మేజర్ న్యూస్:** పొన్నూరు పట్టణం లో మున్సిపల్ కమిషనర్ ఎం రమేష్ బాబు పర్యటించారు. పర్యటన లో భాగంగా పట్టణంలో 3వ వార్డు ఎరుకల వాడ లో మున్సిపల్ డ్రైన్ పై అక్రమంగా పందులు, మేకల కొరకు నిర్మించిన షెడ్లను గుర్తించారు. ఈ ఆక్రమణ వల్ల పారిశుధ్యానికి ఆటంకం కలుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ వాటిని రెండు రోజుల్లో పూర్తిగా తొలగించాలని యజమానుదారులకు ఆదేశించారు. ఆక్రమణలను రెండు రోజుల్లో తొలగించి డ్రైన్ క్లీన్ చేసి పరిశుభ్రంగా ఉంచే విధంగా చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ పి.పోతురాజు ,మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# గ్రూప్-2 పోస్టుకు ఎంపికైన గామాలపాడు పంచాయతీ కార్యదర్శి



కృష్ణవేణి

**దాచేపల్లి, మేజర్ న్యూస్:** పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం, గామాలపాడు పంచాయతీ కార్యదర్శి కె.కృష్ణవేణి గ్రూప్ 2 పోస్టు కు ఎంపికయ్యారు.రెండు రోజుల క్రితం ప్రకటించిన గ్రూప్ 2 ఫలితాల్లో గామాలపాడు పంచాయతీ కార్యదర్శి గా పనిచేస్తున్న కాంద్రకుంట కృష్ణవేణి డిపార్ట్మెంట్ ఆఫ్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ల్యాబ్స్ స్టేట్ హెచ్.ఓడి, విజయవాడ లో జూనియర్ అసిస్టెంట్ పోస్ట్ కు కృష్ణవేణి ఎంపికయ్యారు.ఏడేళ్ల క్రితం 2018 ఏపిపిఎస్సీ గ్రూప్ 3 ద్వారా పంచాయతీ కార్యదర్శి గా ఎంపికై దాచేపల్లి మండలం లోని ముత్యాలంపాడు పంచాయతీ కార్యదర్శి గా ఉద్యోగం లో చేరిన కృష్ణవేణి పిడుగురాళ్ల, దాచేపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శి గా పనిచేశారు.ప్రస్తుతం గామాలపాడు పంచాయతీ కార్యదర్శి గా విధులు నిర్వహిస్తున్న కృష్ణవేణి స్వస్థలం పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం లోని కరాలపాడు గ్రామం తల్లిదండ్రులు శ్రీనివాసరావు,చంద్ర లు వ్యవసాయం చేస్తారని,2018 ఏపిపిఎస్సీ గ్రూప్ 3 ద్వారా ఎస్టీ మహిళ రిజర్వేషన్ లో పంచాయతీ కార్యదర్శి గా ఎంపికయ్యానని కృష్ణవేణి తెలిపారు. 2025 లో జరిగిన ఏపిపిఎస్సీ గ్రూప్ 2 పరీక్షలు రాయడం ద్వారా ఈ పోస్ట్ కు ఎంపికయ్యానని, గ్రూప్ 2 కు ఎంపిక కావడం ఎంతో ఆనందంగా ఉందని కృష్ణవేణి తెలిపారు.దాచేపల్లి ఎంపిడిఓ, డిప్యూటీ ఎంపిడిఓ, ఎంపిడిఓ కార్యాలయం సిబ్బంది,సహచర పంచాయతీ కార్యదర్శులు,గామాలపాడు సర్పంచ్ జంగా సురేష్ ఈ సందర్భంగా కృష్ణవేణి ని అభినందించారు.మూడు రోజుల క్రితం గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ పంచాయతీ కార్యదర్శి అవార్డు ను పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా చేతుల మీదుగా అందుకున్న కృష్ణవేణి కి మూడు రోజుల అనంతరం ఈ పోస్ట్ రావడం పట్ల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు కృష్ణవేణి ని అభినందించారు.

# ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కొనసాగుతుంది

**గుంటూరు, కలెక్టరేట్ మేజర్ న్యూస్:** జిల్లాలో ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం కొనసాగుతుందని జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కే ఖాజావలి తెలిపారు.శుక్రవారం కలెక్టరేట్ లోని ఎస్ ఆర్ శంకరన్ మినీ సమావేశమందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కే ఖాజావలి రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో అమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి డా. టి సేవా కుమార్, బహుజన సమాజ్ పార్టీ ప్రతినిధి చిరతనగండ్ల వాసు, భారతీయ జనతా పార్టీ ప్రతినిధి వైవీ సుబ్బారావు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి సయ్యద్ జానీ బాషా, తెలుగుదేశం పార్టీ నుంచి కె శివరామయ్య, జనసేన పార్టీ ప్రతినిధి సీహెచ్ త్రినాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కే ఖాజావలి మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్యూరిఫికేషన్ లో భాగంగా ఓటర్ల జాబితా లోని డెమోగ్రాఫికల్ సిమిలర్ ఎంట్రీస్ ను నెలరోజుల్లో పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నాము న్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా బూత్ లెవల్ ఏజెంట్ లను నియమించుకొని వివరాలను అందించాలని రాజకీయపార్టీల ప్రతినిధులకు సూచించారు. ఓటరు దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఈఆర్వోలు, ఎఈఆర్వోలకు తెలిపారు. సమావేశంలో ఈఆర్వోలు డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, నగరపాలక సంస్థ అదనపు కమిషనరు చల్లా ఓబులేసు, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ మల్లేశ్వరి, ఏ ఈ ఆర్ వో లైన తహసిల్దార్లు పాల్గొన్నారు,



# బహిరంగ ప్రదేశాల్లో మాంసం విక్రయాలు వద్దు

**తెనాలి, మేజర్ న్యూస్ :** మున్సిపల్ ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మొవ్వ ఏసుబాబుగారు పట్టణంలోని పలు ప్రాంతాల్లో గురువారం పర్యటించారు. 17,18 వార్డు లలో పర్యటించి ఆయా వార్డు లలో జరుగుతున్న కాలువల్లో పూడికతీత, తడి చెత్త పొడి చెత్త సేకరణ వంటి పారిశుధ్య పనులను పరిశీలించి సిబ్బంది కి పలు సూచనలు చేశారు. అనంతరం కబేళా వంతెన వద్ద రోడ్ పైన బహిరంగంగా, మాంసం విక్రయాలు చేస్తున్న వారిని బహిరంగ మాంసం విక్రయించవద్దని హెచ్చరించారు. మాంసం విక్రయ దారులు ముగ్గురికి రూ. 1000 చొప్పున జరిమానా విధించారు. కబేళా ప్రాంగణాన్ని పరిశీలించి ప్రాంగణమంతా శుభ్రంగా ఉంచుకోవాలని అక్కడి వారిని హెచ్చరించారు. అనారోగ్యం తో ఉన్నవాటిని, మృతి చెందిన వాటిని కోయవద్దని అలా చేస్తే కఠిన చర్యలు తప్పవని వారిని హెచ్చరించారు. ఇంచార్జి శానిటరీ ఇన్స్పెక్టర్ ఎం సుబ్బారావు, సానిటరీ సెక్రటరీలు, తదితరులు ఉన్నారు.



# పినపాడు పట్టణ ఆరోగ్య కేంద్రం ప్రయోగశాల పరిశీలన

**తెనాలి, మేజర్ న్యూస్ :** పినపాడు పట్టణ ఆరోగ్య కేంద్రం ప్రయోగశాలను వైద్యాధికారి డాక్టర్ హనోకు బాబు గురువారం పరిశీలించారు. కీటక జనిత వ్యాధుల తీవ్రత, క్షేత్రస్థాయిలో రక్తపూతల నమూనాలను ఆరోగ్య సిబ్బంది సేకరించుచున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. తదుపరి ప్రయోగశాలకు పంపే అంశములను క్షుణ్ణంగా పరిశీలించి తగు సూచనలు, సలహాలను ల్యాబ్ టెక్నీషియన్ కు తెలియజేసినట్లు వైద్యాధికారి డాక్టర్ పరిశపోగు హనోక్ బాబు, పట్టణ సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, యుఎల్ బి ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి తెలియజేశారు. కార్యక్రమంలో మలేరియా సూపర్వైజర్ దీపాల శ్రీనివాసరావు, ఫార్మసిస్ట్ సంధ్యారాణి , ల్యాబ్ టెక్నీషియన్ పత్తి సుధీర్ కుమార్ ,తదితరులు పాల్గొన్నారు.

# ఆర్.వి.ఆర్‌లో మార్కెటింగ్ స్ట్రాటజీలపై వర్క్‌షాప్



**గుంటూరు రూరల్, మేజర్ న్యూస్:** టెక్నాలజీ ఆధారంగా వ్యాపార రంగంలో విద్యార్థులు గ్లోబల్ లీడర్లుగా ఎదగాలని ప్రముఖ పారిశ్రామికవేత్త వెలగపూడి కృష్ణ కుమారి పిలుపునిచ్చారు. స్థానిక చౌడవరంలోని ఆర్.వి.ఆర్ & జె.సి. ఇంజనీరింగ్ కళాశాలలో ఆర్.వి.ఆర్ & జె.సి.సి.ఈ ఎస్.టి.పి ఫౌండేషన్ ఆధ్వర్యంలో "ప్రొడక్ట్ కాస్ట్ ఎఫెక్టివ్ సేల్స్ అండ్ మార్కెటింగ్ స్ట్రాటజీస్ ఫర్ స్టార్టప్స్" అనే అంశంపై గురువారం వర్క్‌షాప్‌ను నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై, స్టార్టప్స్‌కు అవసరమైన మార్కెటింగ్ ప్లానింగ్, ప్రైసింగ్ స్ట్రాటజీ, కస్టమర్ అప్రోచ్, బ్రాండింగ్ వంటి అంశాలపై విద్యార్థులకు ప్రాక్టికల్ ఉదాహరణలతో అవగాహన కల్పిస్తూ, వ్యాపార రంగంలో వివిధ సాంకేతిక అంశాల పాత్రను వివరించి, కొత్త ఆలోచనలతో ముందుకు సాగితే విజయాలు సులభంగా సాధ్యమవుతాయని తెలిపారు. ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త తయారవ్వాలని, "స్వర్ణాంధ్ర-2047" విజన్ లక్ష్య సాధనకు యువ పారిశ్రామికవేత్తలు కీలక పాత్ర పోషించాలని కళాశాల అధ్యక్షులు డా.రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డా. జగదీష్ కె. మద్దినేని పేర్కొన్నారు. తమ కళాశాల విద్యార్థులకు పుస్తక జ్ఞానంతో పాటు పరిశ్రమలలో సమస్యలను గుర్తించే సామర్థ్యం, సృజనాత్మక ఆలోచన, నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించే విధంగా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మరియు స్టార్టప్ వైపు ప్రోత్సహిస్తూ నిపుణులచే ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కళాశాల సెక్రటరీ & కరస్పాండెంట్ రాయపాటి గోపాల కృష్ణ, ట్రెజరర్ డా. కొండబోలు కృష్ణ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. కొల్లా శ్రీనివాస్, అకడమిక్ అండ్ ఆర్ & డీ డైరెక్టర్ డా. కె. రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ & అడ్మినిస్ట్రేషన్ డా. ఎన్.వి. శ్రీనివాస రావు, డా. ఎమ్.వి.పి. చంద్రశేఖర్ రావు, డా. శోభా, డా. ఆలపర్తి ముద్దు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## బుడగ జంగాల గోడు పట్టించుకోండి మహాప్రభో



**పిడుగురాళ్ల,మేజర్ న్యూస్:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో బుడగ జంగాల కులం ఎస్ సి 59 ఉప కులాలలో ఒకటిగా నమోదయి ఉంది. అప్పటి రెండు తెలుగు రాష్ట్రాలలో ఎటువంటి సమస్యలేని ఈ బుడగ జంగాల కులానికి రాష్ట్ర విభజన అనంతరం కుల ధ్రువీకరణ పత్రాలు అందించటంలో పూర్తిగా వైఫల్యం జరిగింది. 2014లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలుగా విడిపోయి పరిపాలన ప్రారంభం కావడంతో ఆంధ్రప్రదేశ్ లో బుడగ జంగాల కులానికి కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వటం లేదు, పలుమార్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారులను కలిసి విన్నపాలు చేసుకున్నప్పటికీ సమస్య పరిష్కారం కావడం లేదు. దీంతో ఆంధ్ర ప్రదేశ్ ఎస్సీ కమిషన్ చైర్మన్ అయిన కొత్తపల్లి జవహర్ వారిని పిడుగురాళ్ల ఆర్ అండ్ బి బంగ్లాలో కలిసి సమస్య పరిష్కరించవలసినదిగా కోరటం జరిగింది. ఈ కార్యక్రమంలో బుడగ జంగాల రాష్ట్ర ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు కడమంటి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి పెల్లురి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల ఆక్స్ఫర్డ్ స్కూలు రహదారి జంగిల్ క్లియరెన్స్



**పిడుగురాళ్ల,మేజర్ న్యూస్:** మండలంలోని జానపాడు పరిధిలో తిరుమల ఆక్స్ఫర్డ్ స్కూలు రహదారి పరిధిలో పేరుకుపోయిన కంప చెట్లు తొలగించే జంగిల్ క్లియరెన్స్ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. సుమారు రూ. 1 లక్ష రూపాయల గ్రాంట్ తో చేపట్టిన పనులు చేపట్టిన పనులు 96% వరకు పూర్తయి. రోడ్లు, హద్దురాళ్ళు బయటపడుతూ స్కూలు ప్రాంతం పూర్వకలను సంతరించుకుంటుంది. నేను రహదారి నుండి ఆక్స్ఫర్డ్ స్కూల్ వరకు రోడ్డు కు రెండు వైపులా కంపచెట్లు తొలగింపు కారణంగా వాహనములు వెళు ్ళటకు ప్రశాంతత ఏర్పడ్డాయి అని స్థానికులు అన్నారు. ఈ కార్యక్రమంలోకొంక రాధ, ఆళ్ళ శ్రీనివాసరావు, పంచాయతీ సెక్రెటరీ రాజేష్ , గ్రామ సర్పంచి టి మర్యాదరావు, వడ్లమూడి వెంకయ్య, ఆరేటి రామారావు, కొంక వెంకట లక్ష్మీనారాయణ, ఆర్ఐటి సత్యనారాయణ, మోటమర్రి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నృసింహుని గ్రామోత్సవం



**మంగళగిరి, మేజర్ న్యూస్:** మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానంలో భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం శ్రీ స్వామి వారు బంగారు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అర్చక స్వాములు శ్రీదేవి, భూదేవి సమేతుడైన నరసింహస్వామి వార్ల ఉత్సవమూర్తులను వాహనంపై అధిష్టింపజేసి రంగు రంగు పూలమాలలతో శోభాయమానం గా అలంకరించారు. స్వామివారి గ్రామోత్సవం తొలత దేవస్థానం మాడవీధులలో నిర్వహించి, అనంతరం మెయిన్ బజార్ మీదగా మిద్దె సెంటర్ వరకు చేరుకొని తిరిగి పెద కోనేరు మీదుగా దేవస్థానం కు చేరుకుంది. గ్రామోత్సవంలో ఆయా సెంటర్లలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకుని టెంకాయలు కొట్టి, కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఉత్సవాన్ని దేవస్థానం సహాయ కమిషనర్ అండ్ కార్యనిర్వాహణాధికారి కోగంటి సునీల్ కుమార్ పర్యవేక్షించారు.

## ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎండీ ఖాసీం తనిఖీ



**గుంటూరు సిటీ మేజర్ న్యూస్ :** గుంటూరు నగరంలోని చౌత్ర సెంటర్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉర్దూ ను ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎండీ ఖాసీం తనిఖీ చేశారు ఈ సందర్భంగా పాఠశాల రికార్డులు, విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలించారు తల్లిదండ్రులు, గ్రామస్తులసహకారంతో తమక్యాచ్ మెంట్ ఏరియాలో ఉన్న విద్యార్థులందరూ పాఠశాలలో చేరే విధంగా ఇప్పటినుండి ప్రణాళికను తయారు చేసుకోవాలని, ప్రభుత్వ పాఠశాలలో చదవటం ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలు పొందవచ్చని తల్లిదండ్రులకు తెలియజేయాలని ఆ దిశగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు ఉర్దూ భాషకు ఉజ్వల భవిష్యత్తు ఉందని,ఉర్దూ భాష నేర్చుకోవటం ద్వారా ప్రపంచం లోని ఏ దేశంలోనైనా వెళ్లేందుకు వీలు కలుగుతుందని అందువల్ల ప్రతి ఒక్కరు ఉర్దూ భాష నేర్చుకునే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు ఈ సందర్భంగా పాఠశాలలోని అందరు విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందజేశారు పాఠశాల ప్రధానోపాధ్యాయులు,నసీమ బేగం ఉపాధ్యాయులు జప్నుల్ల ఖాన్, హబీబున్నిసా బేగం, బచ్చాబేగం, సాజిదాఖానం తదితరులు పాల్గొన్నారు.

# నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు గుంటూరు రాక

### - ఏర్పాట్లు పరిశీలించిన నగర మేయర్ , కమిషనర్



**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం ప్రభుత్వ వైద్యశాలలో కానూరి-జింకానా మాతా శిశు సంరక్షణ కేంద్ర నూతన భవన ప్రారంభోత్సవానికి రానున్నందున సదరు పర్యటన మార్గంలో జిఎంసి నుండి చేపట్టాల్సిన రోడ్లపై గోతులు ఉండకుండా ప్యాచ్ వర్క్లు, డ్రైన్ల శుభ్రం, ఆక్రమణల తొలగింపు చేపట్టాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ కె.మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. గురువారం పోలీస్ పెరేడ్ గ్రౌండ్ నుండి నగరంపాలెం వైపుగా జిజీహెచ్ వరకు విభాగాధిపతులతో కలిసి పర్యటించి, తీసుకోవాల్సిన చర్యలపై తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మేయర్, కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన జరిగే పెరేడ్ గ్రౌండ్ నుండి జిజీహెచ్ వరకు పారిశుధ్యం, ఆక్రమణల తొలగింపు, ప్యాచ్ వర్క్ లు చేపట్టడానికి, పర్యవేక్షణకు విభాగాధిపతులు, డిప్యూటీ కమిషనర్లకు విధులు కేటాయించామని, అందుకు తగిన విధంగా ప్రతి ఒక్కరూ పర్యటన పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. నగరంపాలెం మెయిన్ రోడ్ లో స్పీడ్ బ్రేకర్ ని తొలగించాలని, రోడ్, డివైడర్ల పక్కన మట్టి కుప్పలు లేకుండా చూడాలన్నారు. జిజిహెచ్ పరిసరాల్లో అక్కడి ప్రజారోగ్య సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ శుభ్రంగా ఉంచాలన్నారు. ప్రదానంగా డ్రైన్లు శుభ్రం చేయాలని, సెంట్రల్ మీడియన్స్, ఐలాండ్స్ శుభ్రంగా ఉంచాలన్నారు. నిర్మాణ వ్యర్థాలను, రోడ్ల వెంబడి ఉన్న ట్రావెల్స్, ఇతర పార్కింగ్ వాహనాలను తొలగించాలని సిటి ప్లానర్ ని ఆదేశించారు. పర్యటనలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, జిజిహెచ్ సూపరిండెంట్ డాక్టర్ రమణ యశస్వి, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, సిటి ప్లానర్ రాంబాబు, సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, ఎస్ఈ వెంకటేశ్వరరావు, ఈఈ సుందర్రామిరెడ్డి, ప్రజారోగ్య, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వాల నిర్ణయాలు ఆర్థిక అసమానతలను పెంచకూడదు

### - మాజీ ఐఏఎస్ విజయ్ కుమార్

**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** భారతదేశంలో ఒక్క శాతం ధనవంతుల చేతుల్లో 40 శాతం సంపద కేంద్రీకృతమై వుందని, దేశ జాతీయ ఆదాయంలో వారే 23 శాతం పొందుతున్నారని, మరొకవైపున దిగువన ఉన్న 50 శాతం ప్రజలకు జాతీయ సంపదలో 6 శాతం సంపద మాత్రమే కలిగి 15 శాతం మాత్రమే జాతీయ ఆదాయాన్ని పొందడం బాధాకరమని విశ్రాంతి ఐఏఎస్, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపకులు విజయ్ కుమార్ జి ఎస్ ఆర్ కె ఆర్ తెలిపారు. ఈనెల 29వ తేదీ గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో ఆర్థిక అసమానతల భారత్ పై జన చైతన్య వేదిక ఆధ్వర్యంలో జరిగిన చర్చా గోష్టికి ప్రధాన వక్తగా జి ఎస్ ఆర్ కె ఆర్ విజయ్ కుమార్ హాజరై ప్రసంగించారు. విజయ్ కుమార్ ప్రసంగిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక విధానాలు ఆర్థిక అసమానతలను మరింతగా పెంచేవిగా ఉన్నాయన్నారు. ఓవైపు పేదలు, సామాన్యులు తమ ఆదాయంలో 40 శాతం వివిధ పన్నుల రూపంలో ప్రభుత్వాలకు చెల్లిస్తుంటే, మరోవైపు అత్యధిక ధనవంతులు పారిశ్రామిక రాయితీల పేరుతో వేలాదికోట్ల విలువ చేసే భూములను, సహజ సంపదను అప్పనంగా పొందుతున్నారన్నారు. ప్రపంచంలో అత్యధిక ఆర్థిక అసమానతల గల దేశం మనదేనని, భారత్ లో 90 శాతం మంది పేద, మధ్య తరగతి ప్రజల తలసరి ఆదాయం 887 డాలర్లు ఉంటే మనకన్నా వెనుకబడిన ఆఫ్రికా దేశాలలో 1642 డాలర్లుగా ఉందని, ఆ పేద దేశాల కంటే మనం వెనుకబడి ఉండటం దురదృష్టకరమన్నారు. ఈ నేపథ్యంలో మన విశ్వ గురు భారత్ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో 4వ స్థానానికి ఎదిగిందని, త్వరలో 3వ స్థానానికి చేరుకుంటుందని గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. తలసరి ఆదాయ ప్రాతిపదికన భారత్ 142వ స్థానంలో ఉండటాన్ని గమనించాలన్నారు. నాణ్యమైన విద్య, వైద్యం ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తే పేదరికాన్ని తగ్గించుకోవచ్చని తద్వారా ప్రతి ఏటా విదేశాలకు వెళుతున్న 7.50 లక్షల విద్యార్థులపై అవుతున్న వ్యయం 2.70 లక్షల కోట్లను సద్వినియోగం చేసుకోగలమన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు, శాసనమండలి మాజీ సభ్యులు కె.యస్.లక్ష్మణరావు ప్రసంగిస్తూ మానవ అభివృద్ధి,సమ్మిళత అభివృద్ధి, సుస్థిర అభివృద్ధిలను సాధించడం ద్వారానే ఆర్థిక అసమానతలను తగ్గించుకోగలమన్నారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ భారతదేశంలో దాదాపు 400



మంది బిలినియర్లు దేశ స్థూల ఉత్పత్తిలో సగభాగం కలిగి ఉన్నారని, మరొకవైపు ప్రపంచంలో అత్యధిక మంది పేదలు ఉన్న దేశంగా భారత్ కొనసాగుతుందని వివరించారు. 1990 ఆర్థిక సంస్కరణల తర్వాత ధనవంతులు మిక్కిలి ధనవంతులుగా మారుతున్నారని, ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు కారణమన్నారు. 1950 లో ఒక డాలర్ కు 4రూపాయలు ఉండగా, నేడు 92 రూపాయలకు చేరి రూపాయి విలువ పతనమైందని ఆందోళన వ్యక్తం చేశారు. 1960లో భారత్, చైనాలు ఆర్థికంగా సమానస్థితిలో ఉండగా, నేడు చైనా భారత్ కన్నా 6 రెట్లు స్థూల జాతీయ ఉత్పత్తిని పెంచుకోగలిగిందన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పూర్వ రిజిస్టర్ ప్రొఫెసర్ ఎన్.రంగయ్య ప్రసంగిస్తూ ధనవంతులపై సంపద పన్ను, ఎస్టేట్ డ్యూటీలను విధించి తద్వారా వచ్చే ఆదాయాన్ని పేదలకు విద్య, వైద్య సదుపాయాలతో పాటు ఉపాధి కల్పనకు కేటాయించాలన్నారు. దావోస్ లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో 400 మంది పారిశ్రామిక వేత్తలు పేర్కొన్నట్టుగా సంపదపై పన్ను, వారసత్వ హక్కు పై పన్ను విధించి సంపద కేంద్రీకరణను తగ్గించాలన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ డా॥ ఆలా వెంకటేశ్వర్లు ప్రసంగిస్తూ స్కాండినేవియ దేశాలు, యూరప్ దేశాలలో ఆర్థిక అసమానతలు తక్కువగా ఉండటానికి కారణం ఉచితంగా విద్య, వైద్యం ఆయా ప్రభుత్వాలు అందించడమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనచైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. ధనుంజయ రెడ్డి, విశ్రాంత అడిషనల్ ఎస్పీ కె.వి. చలపతిరావు, బీసీ మహాజన సభ అధ్యక్షులు ఉగ్గం సాంబశివరావు, ప్రోగ్రెసివ్ ఫోరమ్ జాతీయ కార్యదర్శి సంగిరెడ్డి హనుమంత రెడ్డి, ప్రముఖ సైకాలజిస్ట్ అడపా వేణుగోపాల్, అర్థశాస్త్ర విశ్రాంత ఆచార్యులు డా॥ అబ్బరాజు రాజశేఖర్, రాజ్యాంగ చర్చా వేదిక కార్యదర్శి అవధానుల హరి, రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఓరుగంటి నారాయణరెడ్డి తదితరులు ప్రసంగించారు.

# టీటీడీ లడ్డూల తయారీలో అవినీతి నీచం

### - జగన్ పై గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ ఫైర్
### - తప్పు జరగలేదని ప్రమాణం చేస్తావా అని అంబటికి సూటి ప్రశ్న

**గుంటూరు జిల్లా పరిషత్ మేజర్ న్యూస్:** దేవదేవుడు శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ లడ్డూ ప్రసాదాల తయారీలోనూ అవినీతికి పాల్పడిన నీచచరిత్ర వైసీపీ దని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగించిన విషయంపై గురువారం స్థానిక లాలాపేట వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద భక్తులు, కూటమి నాయకులతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ జగన్ సైకో పాలనలో అంతా అవినీతి, అరాచకం రాజ్యమేలిందని విమర్శించారు. కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీస్తూ తిరుమల తిరుపతి దేవస్థానానికి సరఫరా చేసే నెయ్యిలో కల్తీకి పాల్పడటం దుర్మార్గమని మండిపడ్డారు. సుప్రీంకోర్టు తీర్పు ద్వారా తెలుగుదేశం పార్టీ చెప్పింది నిజమైందన్నారు. సుమారు 20 లక్షలకుపైగా లడ్డులు కల్తీ అయ్యాయనే విషయం స్పష్టం చేశారన్నారు. కల్తీ నెయ్యి విషయంలో బుకాయించే అంబటి రాంబాబు తమ ప్రభుత్వంలో తప్పు జరగలేదని విషయాన్ని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ప్రమాణం చేసి చెప్పగలరా అని ప్రశ్నించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్తుల విషయంలో అవినీతికి పాల్పడటం నీచమైన విషయమన్నారు. అప్పటి తిరుమల తిరుపతి దేవస్థానం సభ్యులుగా ఉన్న వారిలో కొందరిని గైర్హాజరు పరిచి దుర్మార్గాలకు పాల్పడ్డారని విమర్శించారు.



# ఈశ్వర్ కళాశాల, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ, ట్రాఫిక్ అవగాహన ర్యాలీ



## ఘనంగా వరల్డ్ ఆటోమొబైల్ డే వేడుకలు



**నరసరావుపేట రూరల్ మేజర్ న్యూస్ :** నరసరావుపేట స్థానిక కేసానుపల్లి లోని ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల, రోటరీ క్లబ్ నరసరావుపేట సంయుక్తంగా రోడ్ సేఫ్టీ & ట్రాఫిక్ అవగాహన ర్యాలీ, వరల్డ్ ఆటోమొబైల్ డే వేడుకలను ఆటో మొబైల్ ఇంజనీరింగ్ అల్యూమ్ని పూర్వ విద్యార్థుల సహకారంతో గురువారం ఘనంగా నిర్వ హించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. నాగమల్లేశ్వర రావు తెలియచేశారు. రోడ్ సేఫ్టీ & ట్రాఫిక్ అవగాహన ర్యాలీకి ముఖ్య అతిథులుగా యన్. శివనాగేశ్వరరావు ఎం.వి.ఐ, నరసరావుపేట పల్నాడు జిల్లా సిహెచ్. లోకనాథం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నరసరావుపేట పల్నాడు జిల్లా, షేక్. కరీం మోహిద్దీన్ ప్రెసిడెంట్ రోటరీ క్లబ్ నరసరావుపేట హాజరై ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సురక్షిత ప్రయాణం మనందరి బాధ్యతని, ట్రాఫిక్ రూల్స్'ని పాటిస్తూ సేఫ్ డ్రైవింగ్ ద్వారా ప్రమాదాలను నివారించవచ్చునని పేర్కొ న్నారు. కళాశాలలో జరిగిన వరల్డ్ ఆటోమొబైల్ డే వేడుకల లో ప్రధాన అతిథి యన్. శివనాగేశ్వరరావు ఎం.వి.ఐ మాట్లాడుతూ దేశంలోనే అత్యున్నతంగా ఆటోమొబైల్ రంగం అగ్రగామిగా ఉందని, అంతే కాకుండా ఎంతో మందికి ఉపాధి నిస్తుందని తెలిపారు. ఈ కోర్సును ఎంచుకున్న విద్యార్థులు కష్టపడి ఉన్నత స్థితికి చేరాలని కోరారు. వరల్డ్ ఆటోమొబైల్ డే కార్యక్రమాన్ని మూడు రోజులపాటు నిర్వహించామని, షార్ట్ ఫిలిం, పోస్టర్ ప్రెజెంటేషన్, రోల్ ప్లే కేటగిరీలలో విజేతలకు బహు మతులు, ప్రతిభను కనపరిచిన వారికి ప్రోత్సాహక సర్టిఫికెట్లు అందజేశామని కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. నాగమల్లేశ్వర రావు తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని నరసరావుపేట సుజుకి షోరూం, లోటస్ హీరో షోరూం వారు ఈశ్వర్ కళాశాలలో ఏర్పాటుచేసిన క్రొత్త ద్విచక్ర వాహనాల ప్రదర్శనశాల ప్రత్యేక ఆకర్షణగా నిలచిందని ఆటో మొబైల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ఆర్.రాంబాబు తెలియజేశారు. వరల్డ్ ఆటోమొబైల్ డే ముగింపు కార్యక్రమంలో విశిష్ట అతిథిగా సిహెచ్. మనీషా, నరసరావుపేట, కళాశాల చైర్మన్ షేక్. మీరావలి, మేనేజింగ్ డైరెక్టర్ డా. షేక్. మస్తాన్ షరీఫ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్. నజీమా, బి. మునీంధర్ రెడ్డి, సెక్రటరీ రోటరీ క్లబ్ నరసరావుపేట, ఇతర రోటేరియన్స్ అయిన షేక్. జిలానీ మాలిక్, పి.డి.జి తాళ్ళ రాజశేఖర్ రెడ్డి, సుమిత్ర, ఆటో మొబైల్ ఇంజనీరింగ్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పేదల పొట్ట గొట్టే చట్టాన్ని తిప్పి కొట్టండి

## ఏ ఐ ఏ ఆర్ ఎల్ ఏ నాయకులు లోకం భాస్కరరావు



**దుగ్గిరాల మేజర్ న్యూస్ :** వికసిత్ భారత గ్యారెంటీ ఫర్ రోజ్ గార్, అజీవికా మిషన్ కొత్త పథకాన్ని లోకసభ రాజ్యసభలలో ఆమోదించి రాష్ట్రపతి చేత ఆమోదం ముద్ర వేయించారని ఇది కార్పొరేట్ శక్తులకు అనుకూలంగాను పేద ప్రజలకు వ్యతిరేకంగానూ ఉండబోతుందని అఖిలభారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం నాయకులు లోకం భాస్కరరావు అన్నారు. రెండు దశాబ్దాలుగా కోట్లాదిమంది గ్రామీణ పేదల కడుపు నింపుతున్న చట్టాన్ని కాలగర్భంలో కలిపేసారన్నారు. రాష్ట్రాలపై మరింత భారాన్ని మోపి, క్రమేపి చట్టాన్ని రద్దు చేసే కుట్ర జరుగుతుందన్నారు. గ్రామీణ పేదలకు అండగా అఖిలభారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా దుగ్గిరాల రెవిన్యూ కార్యాలయం వద్ద ఫిబ్రవరి రెండవ తేదీన ధర్నా జరుగుతుందని లోకం పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పేద కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ధర్నాను జయప్రదం చేయాలని బర్ల లోకం భాస్కరరావు కోరారు.

# సిపిఎం పార్టీ సానుభూతిపరుడు మృతి



**దుగ్గిరాల మేజర్ న్యూస్ :** దుగ్గిరాల మండల పరిధిలోని తుమ్మపూడి గ్రామానికి చెందిన సిపిఎం పార్టీ సానుభూతిపరుడు బోడపాటి నాగే ంద్ర అనారోగ్య కారణంగా మృతి చెందాడు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కే. ఉమా మహేశ్వర రావు, కె ధనలక్ష్మి జిల్లా సెక్రెటరీ సభ్యులు ఎం.రవి, కెవిపిఎస్, రాష్ట్ర నాయకులు జే.నటరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జెట్టి బాలరాజు, గ్రామ కార్యదర్శి బి.చిరంజీవి, రాఘవేంద్రరావు, టి.రవి పాల్గొని నివాళులర్పించారు.

# పాఠశాలకు బహుమతులను అందజేసిన పూర్వ విద్యార్థి



**దుగ్గిరాల మేజర్ న్యూస్ :** దుగ్గిరాల మండల పరిధిలోని రేవేంద్రపాడు గ్రామంలో గల జడ్పిహెచ్ఎస్ పాఠశాల పూర్వ విద్యార్థి తను విజయనభ్యసించిన పాఠశాలకు బహుమతులను అందజేశారు. పాఠశాల లో 1959వ సంవత్సరంలో విద్యను అభ్యసించిన ముసునూరి సాంబరావు ప్రతి ఏడాది ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు మొదటి నాలుగు స్థానాలు సాధించిన బాలబాలికలకు బహుమతులను అందజేస్తున్నారు. ఈ ఏడాది ఆరో తరగతి నుండి పదవ తరగతి వరకు మొదటి నాలుగు స్థానాలు సాధించిన బాల బాలికలకు బహుమతులను అందజేశారు. మొదటి స్థానం.పొందిన విద్యార్థులకు 6000 రూపాయలు చొప్పున ఐదుగురికి 30 వేల రూపాయలు, ద్వితీయ స్థానం ను దక్కించుకున్న ఒక్కొక్కరికి 5000 రూపాయలు చొప్పున 25 వేల రూపాయలు, మూడవ స్థానం దక్కించుకున్న ఒక్కొక్కరికి 4000 చొప్పున 20000 రూపాయలు, నాలుగో స్థానం దక్కించుకున్న ఒక్కొక్కరికి మూడు వేల రూపాయలు చొప్పున 15000 రూపాయల తోపాటు పాఠశాలకు ఆట పరికరముల నిమిత్తం 5000 రూపాయలు నగదును అందజేశారు. సుమారు 95 వేల రూపాయలను ముసునూరి తులసమ్మ, భూషయ్య మెమోరియల్ ఎండోమెంట్ ఫండ్ నుండి ముసునూరి సాంబశివరావు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బివి కృష్ణారావుకి అందజేశారు. సాంబశివరావుతో పాటు అనుమాలు శివరాం ప్రసాద్ పాల్గొన్నారు. పాఠశాలకు కావలసిన కనీస వసతులు వసతులు పై చర్చించగా వసతులను మెరుగుపరిచేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో అనుమాలు శివరాం ప్రసాద్ వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఎస్సీ మోర్చా అధ్యక్షులకు నియామక పత్రాలు అందజేసిన

## పల్నాడు జిల్లా బీజేపీ అధ్యక్షులు శశి కుమార్



**నరసరావుపేట మేజర్ న్యూస్ :** పల్నాడు జిల్లాలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సీ మోర్చా అధ్యక్షులకు గురువారం నరసరావుపేట లోని బీజేపీ పార్టీ కార్యాలయం లో పల్నాడు జిల్లా బీజేపీ అధ్యక్షులు శశి కుమార్ నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమం లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శశి కుమార్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తోందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి వర్గానికి చేరుతున్నాయని తెలిపారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తే బీజేపీకి బలమని పేర్కొంటూ, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధ్యక్షులు సమన్వయంతో పనిచేసి పార్టీని పల్నాడు జిల్లాలో మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి అధ్యక్షులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కంప్యూటర్స్ ఎడ్యుకేషన్ లో ప్రతిభ కలిగిన విద్యార్థులకు బహుమతులు




**దుగ్గిరాల మేజర్ న్యూస్ :** దుగ్గిరాల గ్రామం లోని బాలికోన్నత పాఠశాలను సిసిఎల్ అధికారులు సందర్శించారు. గత ఏడాది కంప్యూటర్ ఎడ్యుకేషన్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థు నులకు సర్టిఫికెట్స్ ను అందజేశారు. ఎస్ఏ వన్ లో ప్రతిభ కలిగిన పదవ తరగతి విద్యార్థు ను.లు పెనుగొండ షణ్ముఖ ప్రియ, ఛాయల శ్రీవిద్య కు మెడల్స్ ను. అందజేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్ శోభా దేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో విపిన్ సింఘాల్, పూర్ణ, బలరాం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఐదేళ్ల పాలనలో సనాతన ధర్మానికి తూట్లు..!, జగన్ 2.0 తో శ్రీవారి మాయం ఖాయం..!

## – ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి



**మాచర్ల మేజర్ న్యూస్ :** జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో సనాతన హైందవ ధర్మానికి తూట్లు పొడిచారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తిరుమల లడ్డు ప్రసాదం కల్తీపై ఆయన మీడియాతో మాట్లాడారు. కల్తీ, నకిలీల సృష్టిలో ప్రపంచ స్థాయి పేటెంట్ రైట్ జగన్మోహన్ రెడ్డి సొంతమని ఎద్దేవా చేశారు. నెయ్యికి బదులు 60 లక్షలు లీటర్ల కెమికల్స్ వాడి 20 కోట్ల లడ్డూ ప్రసాదాలను తయారుచేసి కోట్లాదిమంది భక్తుల మనోభావాలతో ఆటలాడారని విమర్శించారు. తిరుమల కొండపై విస్తృతంగా అన్యమత ప్రచారం చేసి, హిందూ సాంప్రదాయాలను కించపరిచేలా ప్రవర్తించారని మండిపడ్డారు. రామతీర్థంలో రాములు వారి విగ్రహం ధ్వంసం, అంతర్వేదిలో స్వామి వారి రథం దగ్ధం చేసి, భక్తుల సెంటిమెంట్ పై దెబ్బ కొట్టారని ఆరోపించారు. నకిలీ మద్యంతో 30 లక్షల మంది ప్రాణాలను బలికొన్న దుర్మార్గుడు జగన్ రెడ్డిని అన్నారు. గత ఐదేళ్ల పాలనలో జగన్ జగన్ చేసిన దోపిడీ, దౌర్జన్యం, అవినీతిపై కూటమి ప్రభుత్వం తప్పనిసరిగా విచారణ చేస్తుందని వివరించారు. కల్తీ, నకిలీ లపై విచారణ చేస్తుంటే..., వైసీపీ బ్యాచ్ కు నరాల్లో వణుకుపుట్టి, ముందస్తు బెయిల్ కోసం పరుగులు తీస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉన్నా, రూ 23 లక్షల కోట్ల పెట్టుబడులను తీసుకొచ్చి, సీఎం చంద్రబాబు మార్పును మరోసారి చూపించారని కొనియాడారు. ఇప్పటికైనా జగన్ రెడ్డి శవ రాజకీయాలు మానుకుని, చేసిన తప్పులను బేషరతుగా ఒప్పుకోవాలని చట్టం ముందు లొంగిపోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# నాగిరెడ్డి ఆశయ సాధనకు అడుగులు..!

## ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



**మాచర్ల మేజర్ న్యూస్ :** పల్నాటి ప్రజా నాయకుడు, దార్శనికులు, మాజీ శాసన సభ్యులు స్వర్గీయ జూలకంటి నాగిరెడ్డి ఆశయాల సాధనకు అడుగులు పడుతున్నాయని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఉద్ఘాటించారు. గురువారం మాచర్ల నియోజకవర్గం, వెల్దుర్తి మండల కేంద్రంలో జరిగిన దివంగత నాగిరెడ్డి వర్ధంతి కార్యక్రమాల్లో ఆయన పాల్గొని, విగ్రహానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాచర్ల నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు పాటుబడిన వ్యక్తి తన తండ్రి నాగిరెడ్డి అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాచర్ల నియోజకవర్గం కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మేలురకం మిరప సాగుతో రైతులకు సిరుల పంట



మాచర్ల మేజర్ న్యూస్ : ప్రస్తుత కాలంలో మిరప సాగు చేస్తున్న రైతన్నలకు తెగుళ్ల బెడద పెద్ద సవాలుగా మారింది. ముఖ్యంగా నల్ల తామర పురుగు, వైరస్ వ్యాధుల వల్ల రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారు. ఇలాంటి తరుణంలో స్టార్ ఫీల్డ్ వారి 'జిని 2626' హైబ్రిడ్ మిరప రకం రైతులకు ఆశాజనకంగా కనిపిస్తోంది అని ఆ కంపెనీ ఆర్.ఎం హరిబాబు తెలిపారు. గురువారం బెల్లంకొండవారి పాలెం చెందిన రైతులతో క్షేత్రప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన అనంతరం హరిబాబు మాట్లాడుతూ, ఇటీవల కాలంలో రైతులను వేధిస్తున్న నల్ల తామర పురుగు ఉధృతిని జిని రకం సమర్థవంతంగా తట్టుకుంటుందని క్షేత్రస్థాయిలో నిరూపితమైంది అని తెలిపారు. మొక్కలు దృఢంగా పెరిగి, ఎక్కువ కొమ్మలతో కాయలు కాస్తాయి. మిరప సాగులో మేలైన విత్తనాలను ఎంచుకోవడంతో పాటు, సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా మంచి లాభాలు గడించవచ్చు అని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఎస్.ఓ మనోహార్ రెడ్డి, మాచర్ల డిస్ట్రిబ్యూటర్ పాల్వాయి బ్రహ్మానందరెడ్డి, గ్రామానికి చెందిన రైతులు పాల్గొన్నారు.

## టిడిపి అధ్యక్షుడు జానీ సైదా ప్రమాణస్వీకారం



మాచవరం మేజర్ న్యూస్ : గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా అధ్యక్షులు జానీ సైదా నర్సాపేటకు ప్రమాణ స్వీకారానికి సంఘీభావం తెలపటానికి తుర్కపాలెం నుంచి బయలుదేరిన మైనార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి తెలుగు యువత అధ్యక్షుడు షేక్ అసాన్వలి, తురకపాలెం మాజీ సర్పంచ్ షేక్ మాబువలి, షేక్ నజీర్, షేక్ అల్లావుద్దీన్, టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు తరలి వెళ్లారు.

## సజ్జల రామకృష్ణారెడ్డిను మర్యాదపూర్వకంగా కలిసిన షేక్. నాగుర్ భాష



పొన్నూరు మేజర్ న్యూస్ : రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో వైయస్సార్సిపి గుంటూరు జిల్లా విద్యార్థి విభాగం ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా నియమితులైన సందర్భంగా తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కో – ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ను గుంటూరు జిల్లా విద్యార్థి విభాగం ఎగ్జిక్యూటివ్ మెంబర్ షేక్. నాగూర్ భాషా మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ మాట్లాడుతూ 2029లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి ను పొన్నూరు ఎమ్మెల్యేగా అంబటి. మురళీకృష్ణ ను గెలిపించుకోవాలని తెలిపారు.పార్టీ కోసం కష్టపడుతున్న విద్యార్థుల పై కేసులు పెట్టి ఇబ్బంది పెట్టిన అధికారులపై డిజిటల్ బుక్ లో నమోదు చేయాలని సూచించారు.

## జిల్లా కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న కూటమి నేతలు



పిడుగురాళ్ల మేజర్ న్యూస్ : పట్టణంలోని యస్.యస్.ఎన్ కాలేజీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షేక్ జానీసైదా, కమిటీ సభ్యుల ప్రమాణస్వీకార మహోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, యువ నాయకులు యరపతినేని సాయి నిఖిల్ ఆదేశాల మేరకు పిడుగురాళ్ల పట్టణం నుండి తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి వెళ్లడం జరిగింది.



## ఉపాధి హామీ పథకం పేరు మార్పు తగదు
### – మాజీ కేంద్ర మంత్రి జెడి శీలం

తెనాలి మేజర్ న్యూస్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకం నిర్వీర్యం చేస్తోందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షులు జెడి శీలం విమర్శించారు. తెనాలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డాక్టర్ చందు సాంబశివుడు ఆధ్వర్యంలో తెనాలి మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉన్న గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఉపాధి హామీ పథకాన్ని పేరు మార్చడం బీజేపీ ప్రభుత్వం చేసింది ఆ పేరును మరలా యధావిధిగా కొనసాగించాలని కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేశారు. బీజేపీ పాలనలో పేద, మధ్య తరగతి, సామాన్య ప్రజలపై తీవ్ర భారం పడుతున్నదన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. నిరసన శిబిరంలో ప్లకార్డులు చేతబట్టి పాల్గొన్నారు. కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు యన్నం సుధీర్ గారు సిపిఎం బాబు, ఎం సాంబశివరావు, తెనాలి టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు పొన్నూరు నాగ సూర్య శశిధర్ రావు, గుంటూరు జిల్లా జనరల్ సెక్రటరీ యన్నంశెట్టి శివరామకృష్ణ ప్రసాద్, తెనాలి టౌన్ ఉపాధ్యక్షులు గుర్రపు ద్వారక శ్రీనివాస్, పి శివకుమార్, భీమా రమేష్, పి స్టీవెన్ బాబు, శంకర్ రావు, కె కోటేశ్వరరావు, యస్ సుబ్బారావు, మాధవరావు, కృష్ణ వీరాస్వామి, పూలేరామ్ సుబ్బారావు, శ్రీను, మల్లిఖార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

# కల్తీ నెయ్యి పై జగన్ అసెంబ్లీలో చర్చకు రావాలి

### వైసీపీ ఎమ్మెల్యేలు, నేతలకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి సవాల్



గుంటూరు సిటీ మేజర్ న్యూస్ : కల్తీ నెయ్యి వ్యవహారంపై వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ధైర్యం ఉంటే అసెంబ్లీలో చర్చకు రావాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి సవాల్ విసిరారు. గురువారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ 201924 వైసీపీ పాలనలో తిరుమల తిరుపతి దేవస్థానానికి కల్తీ నెయ్యి సరఫరా జరిగిందని, సుప్రీంకోర్టు నియమించిన సిట్ స్పష్టంగా నిర్ధారించిందని, అదే నెయ్యిని శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో ఉపయోగించడంతో కోట్లాది భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తిరుమలకు నెయ్యి సరఫరా టెండర్లకు సంబంధించిన కఠిన నిబంధనలను సడలించి, కల్తీ నెయ్యి సరఫరా చేసే సంస్థలకు మార్గం సుగమం చేసిందన్నారు. 29-02-2020న టీటీడీ బోర్డు తీర్మానం ద్వారా నాణ్యత ప్రమాణాలకు తిలోదకాలు ఇచ్చారని విమర్శించారు. ఐదేళ్లలో టీటీడీకి 1.61 కోట్ల కిలోల నెయ్యి కొనుగోలు చేయగా, అందులో సుమారు 60 లక్షల కిలోలు కల్తీ నెయ్యి ఉండటంతో దాదాపు 20 కోట్ల లడ్డూలు తయారయ్యాయని సిట్ వెల్లడించిందన్నారు. ల్యాబ్ నివేదికల్లో జంతు కొవ్వు, రసాయన పదార్థాలు బయటపడినా అప్పట్లో ఎలాంటి చర్యలు తీసుకోలేదని, దేవుడిపై నమ్మకం లేకే వైసీపీ ఈ అపవిత్ర చర్యలకు పాల్పడిందని, ఈ అంశంపై వైసీపీ సభ్యులతో కలిసి జగన్ మోహన్ రెడ్డి అసెంబ్లీలో చర్చకు రావాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి డిమాండ్ చేశారు.

# మద్యం దుకాణాలు సమయపాలన పాటించాలి

### మంగళగిరి రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్



మంగళగిరి మేజర్ న్యూస్ : మద్యం దుకాణాలు సమయపాలన పాటించాలని మంగళగిరి రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ అన్నారు. మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్ లో గురువారం ఆయన రూరల్ పరిధిలోని మద్యం షాపులో యజమానులతో సమావేశం నిర్వహించారు. శాంతిభద్రతలు పరిరక్షణ, నేరాల నియంత్రణ లక్ష్యంగా మద్యం విక్రయ కేంద్రాలపై కఠిన నియంత్రణ చర్యలు చే పట్టడం జరిగిందన్నారు. రాత్రి తప్పనిసరిగా 10 గంటలకే అన్ని మద్యం విక్రయ కేంద్రాలు మూసివేయాలని, ప్రజాస్థలాల్లో, రోడ్ల వెంబడి బహిరంగ మద్యపానం ఎట్టి పరిస్థితుల్లో అనుమతి లేదని స్పష్టం చేశారు. అలాగే బెల్టు షాపుల నిర్వహణ పూర్తిగా నిషేధమని, రాత్రిపూట ఎక్కడా అక్రమ మద్యం అమ్మకాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి వైన్ షాప్ వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి అని, వాటిని నిరంతరం పనిచేసే స్థితిలో ఉంచాలని సూచించారు. భద్రత పరంగా వాచ్‌మన్ నియామకం, రోడ్లపై మద్యం తాగి సీసాలు విసిరేయకుండా నివారించేందుకు డస్ట్‌బిన్ల ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వైన్ షాపుల పరిసర ప్రాంతాల్లో ప్రజలకు అసౌకర్యం కలిగించే పరిస్థితులు ఏర్పడితే యజమానులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. వైన్ షాపుల వద్ద సూచికలతో కూడిన బోర్డు లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వైన్ షాపుల వద్ద ఘర్షణలు ఏమైనా జరిగినట్లయితే వెంటనే పోలీస్ వారికి తెలియజేయాలని కోరారు.

# యూపీహెచ్‌సీలో వైద్య సేవలు భేష్

### ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన బీజేపీ నాయకులు



మంగళగిరి మేజర్ న్యూస్ : నగరంలోని ఇందిరానగర్ యూపీహెచ్‌సీ ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని గురువారం పట్టణ బీజేపీ నాయకులు సందర్శించారు. హెల్త్ సెంటర్లో రోగులకు అందుతున్న సేవలు, హెల్త్ సెంటర్ ను పరిశీలించారు. నాయకులు రోగులను కలిసి వైద్య సేవల వివరాలు, సిబ్బంది పనితీరు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలో ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డుల నమోదు ప్రక్రియ, కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే మందులు, పథకాల అమలు తదితర విషయాలను ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ అనూష ను అడిగి తెలుసుకున్నారు. నాయకులు కూడా హెల్త్ సెంటర్లో వైద్య పరీక్షలు చేయించుకొని మందులు తీసుకున్నారు. హెల్త్ సెంటర్లో వైద్య సేవలపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం బీజేపీ పట్టణ అధ్యక్షుల మునగాల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు బుద్దంటి రవికిరణ్ మాట్లాడారు. దేశంలో 1,83,682 రాష్ట్రంలో 12, 874 ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయన్నారు. పట్టణంలో మూడు ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయని 60 రకాల రక్త పరీక్షలు, 170 రకాల మందులు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ఉచితంగా అందజేసే వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెల్త్ సెంటర్లో డాక్టర్ అనూష, సిబ్బంది అందిస్తున్న వైద్య సేవలు సంతృప్తిగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ కార్యదర్శులు కొల్లి బాబూరావు, పోలిశెట్టి సోమశేఖర్, బీజేపీ నాయకుడు అద్దంకి వెంకటేశ్వరరావు, పెండెం మధుసూదనరావు సిద్ధాంతి తదితరులు పాల్గొన్నారు.

## భక్తుల మనోభావాలను గాయపరిచిన ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి క్షమాపణలు చెప్పాలి

### – మాజీ ఐఏఎస్ అధికారి విజయ్ కుమార్

గుంటూరు జిల్లా పరిషత్ మేజర్ న్యూస్ : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా తిరుమల లడ్డులో జంతు కొవ్వు కలిసిందని ఆరోపించారని, సిబిఐ నివేదిక జంతు కొవ్వు కలువ లేదని స్పష్టంగా పేర్కొందని, కావున రాష్ట్ర ప్రజలకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న వెంకటేశ్వరస్వామి భక్తులకు నారా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ లు బహిరంగ క్షమాపణ తెలపాలని డిమాండ్ చేశారు. ఈనెల 29వ తేదీ గుంటూరులోని జన చైతన్య వేదిక హాలులో విలేకరుల సమావేశంలో లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపకులు మాజీ ఐఏఎస్ జీవన్ ఆర్ కే ఆర్ విజయకుమార్ ప్రసంగించారు, ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం గత 20 నెలలుగా రాష్ట్రంలో భూములు, గనులు, ఇసుక లాంటి కేటాయింపుల ద్వారా కొద్ది మందికి ఆర్థిక ప్రయోజనాలను కట్టబెడుతుందని, రాజధాని పేరుతో ఒక మున్సిపాలిటీని నిర్మించడానికి వేలాది కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తుందని, గత ఏడాదిన్నరగా 3 లక్షల కోట్లకు పైగా అప్పులు చేస్తూ ప్రతి నెల 7వేల కోట్లకు పైగా వడ్డీలు చెల్లిస్తుందని తెలిపారు. గత 20 నెలలుగా ఒక్క కొత్త ఇంటిని నిర్మించి, పేద లబ్ధిదారులకు ఇవ్వలేదని కనీసం ఒక్క సెంటు భూమిని కూడా వాళ్లకు అందించలేదని, మరొకవైపు 99 పైసలకే వందలాది ఎకరాల పట్టణ భూములు వారి అనుయములకు కేటాయిస్తూ వాళ్లకు లబ్ధి చేకూరుస్తున్నారని, ఉత్తరాంధ్ర, రాయలసీమ, ప్రకాశం లాంటి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఎలాంటి కృషి చేయడం లేదన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి పేర్కొన్న 20 లక్షల కోట్ల పెట్టుబడులు, 23 లక్షల ఉద్యోగాలు ఎక్కడ ఉన్నాయో ప్రజలకు తెలపాలన్నారు. సాగునీటి పారుదల ప్రాజెక్టులకు సరిపడ నిధులు కేటాయించకపోవడం వలన వ్యవసాయ రంగంలో ఉపాధి కోల్పోతున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నికల కమిషన్ ను ఉపయోగించుకుని యస్ ఐ ఆర్ పేరుతో, ఓటర్ల ప్రక్షాళన పేరుతో వలస కార్మికుల ఓట్లను తొలగిస్తున్నారని తెలుపుతూ ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు. పది ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పిపిపి పద్ధతిలో ప్రైవేటీకరణ చేయటాన్ని రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ భావ సారూప్యత గల శక్తులన్నిటినీ కలుపుకొని ఐక్యంగా ఉద్యమిస్తామన్నారు. ఐటీ, విద్యాశాఖ మంత్రిగా ఉన్న నారా లోకేష్ ఏ అధికారంతో 99 పైసలకే భూములిస్తామని, అహంభావంతో పేర్కొనడాన్ని దుయ్యబట్టారు.

# జగన్ హయాములో తిరుమల లడ్డు కల్తీ

## - ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



**మాచవరం, మేజర్ న్యూస్ :** గత వైకాపా ప్రభుత్వంలో తిరుమల లడ్డు ప్రసాదం కల్తీ జరిగినట్టు సిట్ ఇచ్చిన నివేదిక నేపథ్యంలో పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం, మాచవరం మండలం, మోర్జంపాడు గ్రామం నందు కొలువైయున్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి 70వ కళ్యాణ మహోత్సవ సందర్భంగా వారి దేవాలయం నందు గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు పూజారులతో భక్తులతో కలసి ఆలయాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేసి ప్రెస్మీట్ లో పాల్గొనటం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 నుండి 2024 వరకు తిరుమలలో వైసీపీ ప్రభుత్వం అధికార దుర్వినియోగం చేసి పవిత్రమైన తిరుమల లడ్డులో జంతువుల కొవ్వు కలపి హిందువుల మత విశ్వాసాలను తీవ్రంగా గాయపరచిందని కోట్లాది మంది భక్తుల , ప్రజల విశ్వాసాన్ని వైసీపీ ప్రభుత్వం వమ్ము చేసిందని యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. 2019 నుండి 2024 వరకు తిరుమల లడ్డులో వినియోగించిన నెయ్యి మొత్తం ఒక కోటి అరవై ఒక్క లక్షల కిలోల నెయ్యిలో అరవై లక్షల కిలోల నెయ్యితో ఇరవై కోట్ల లడ్డులు ఇతర ప్రసాదాలు తయారు చేసి 250 కోట్ల రూపాయలు తిరుమల ప్రసాదం ద్వారా వైసీపీ ప్రభుత్వం అవినీతి చేసిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు ద్వారా సిబిఐ, రాష్ట్ర ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసి ఎంక్వయిరీ చేయడం జరిగిందని ఆయన అన్నారు. అడ్డగోలు సంపాదనకు కోట్లాదిమంది భక్తులు మనోభావాలు దెబ్బతీసే సంఘటన వైసిపి వాళ్ళ ద్వారా జరిగిందని ఆయన అన్నారు. వైసీపీ గతంలో ఒక్క అవకాశం ఇవ్వమని అన్నారు అని అందుకు ఒక్క అవకాశం ఇచ్చి మరల ఎన్నికల్లో 151 సీట్లును గాను 11 సీట్లు మాత్రమే ప్రజలు అవకాశం ఇచ్చారని ఆయన అన్నారు. ప్రజలు వైసీపీని క్షమించిన, ప్రకృతి వదలదని, నరసింహ స్వామి దేవాలయం వద్ద మాట్లాడుతున్నానని ,శ్రీలక్ష్మి నరసింహ స్వామి ఉగ్రరూపం దాలిస్తే ఏం జరుగుతుందో ప్రజానీకానికి తెలుసని ఆయన అన్నారు. డిసెంబర్ 21న పిడుగురాళ్ల శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం ఎంతో వైభవంగా నిర్వహించి, నియోజకవర్గంలో లక్ష కుటుంబాలకు గాను 90 వేల కుటుంబాలకు లడ్డు, కుంకుమ పసుపు అక్షింతలు, నూతన సంవత్సర క్యాలెండర్ పార్టీలకతీతంగా మతాలకతీతంగా అందరికీ అందజేయడం జరిగిందని ఆయన అన్నారు. ఎవరు తప్పు చేసినా దేవుడు క్షమించడని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి మండల కన్వీనర్ బడిగుంచల వెంకటేశ్వర్లు, గుర్రం రామారావు, ఎలగాల నరసింహారావు, గడిపూడి శ్రీకాంత్, దున్న చెన్నై చౌదరి, గడిపూడి సైదయ్య, వై రాంబాబు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కావూరి పిచ్చయ్య, పాశం రాధాకృష్ణ, చందాల శివ, గాడి పర్తి.నరసింహారావు, మాదల వెంకటేశ్వర్లు యాదవ్, గురజాల నియోజకవర్గం విభిన్న నాయకులు , నాగాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

# చుక్క పాలు లేకుండా రసాయనాలతో నెయ్యి

- తల్లిపాలు కూడా కల్తీ చెయ్యగల దుర్మార్గులు
- ఇలాంటి అభూత 'ఇన్నోవేషన్' కు వైసీపీ ముఠాకు నోబెల్ కెమిస్ట్రీ అవార్డు ఇవ్వాల్సిందే.
- నెయ్యిలో కల్తీ లేదు, స్వామివారికి ద్రోహం చేయలేదు" అని వైసిపి ప్రమాణం చేయగలదా?
- వైసీపీపై కల్తి నెయ్యి విషయంలో మండిపడిన ఎమ్మెల్యే కన్నా.

**సత్తెనపల్లి, మేజర్ న్యూస్ :** నెయ్యిలో కల్తీ జరిగిందని, చుక్క పాలు లేకుండా రసాయనాలతో 'నెయ్యి' తయారు చేసి,ఆ కల్తీ నెయ్యితోనే స్వామివారికి ప్రసాదాలు తయారు చేశారని సిట్ దర్యాప్తు, ఛార్జ్ షీట్ ల ద్వారా బట్టబయలైంది... ఇప్పుడు వైసీపీ నేతలు ఏం సమాధానం చేపుతారని... మాజీ మంత్రి, శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ వైఎస్ఆర్ సీపీపై తీవ్రంగా మండిపడ్డారు. కల్తీశ్రీశ్రీ విషయంలో సిట్ దర్యాప్తు నివేదిక పై గురువారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు.అందులో ఆయన మాట్లాడుతూ...గతంలో మేము ప్రతిపక్షంలో ఉన్నప్పుడే తిరుపతిలో జరిగే కల్తీ లడ్డు వ్యవహారంపై అనుమానం వ్యక్తం చేశామన్నారు.. నాడు మేము చెప్పినట్లు గానే.. నేడు సుప్రీం కోర్టు ఆధ్వర్యంలోని సిట్ దర్యాప్తు నిగ్గు తేల్చిందన్నారు. తల్లిపాలు కూడా కల్తీ చెయ్యగల దుర్మార్గులని మండిపడ్డారు. దేవదేవుడి ప్రసాదం విషయంలో జరిగిన ఈ మహా కల్తీ గుట్టు రట్టయింది... "మేము ఏ తప్పూ చేయలేదు" అని అన్న వైసీపీ నాయకుల ముఠా ఇప్పుడు ఏమంటారు? నెయ్యి కల్తీ చేయలేదు, స్వామివారికి ద్రోహం చేయలేదు" అని వైసిపి నేతలు ప్రమాణం చేయగలరా? అని ప్రశ్నించారు. తప్పు లేదని చెప్పేవారు ఎందుకు బెయిల్ కోసం కోర్టుకు వెళ్లారు? కల్తీ నెయ్యి గురించి ఎవరు మాట్లాడకూడదని కోర్టు నుంచి ఎందుకు ఆదేశాలు తెచ్చుకున్నారు? బ్యాంకు ఖాతాల వివరాలు ఇవ్వడానికి ఎందుకు తిరస్కరించారని? నీలాదీశారు. అధికారులను బలి చేయటం వైసీపీ కి అలవాటేనన్నారు. చిన్న కేసు కదా.. అని పరకామణిలో దొంగతనం చేసిన వాళ్లను వెనుకేసుకొస్తారని విమర్శలు చేశారు.బంగారం తాపడం అని ఏకంగా స్వామి వారికి బురిడీ తొడుగు తొడిగారని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వ హయాంలో అనేక ఘటనలు గత ప్రభుత్వంలో తిరుమల పవిత్రతను దెబ్బతీశాయి. జగన్ రెడ్డి ప్రోత్సహించాడు కాబట్టే వైసీపీ పాలనలో, భారతదేశ చరిత్రలో ఎక్కడా ఎన్నడూ జరగని విధంగా ఆంధ్రప్రదేశ్లో దేవాలయాలు, హిందూ మతంపై దాడులు జరిగాయన్నారు. ఇప్పటికైనా కల్తీగాళ్ళు తప్పు తెలుసుకుని స్వామివారిని క్షమాపణ అడిగితే బాగుంటుందని... లేకపోతే వాళ్ళ పాపానికి నిష్కృతి లేదన్నారు.



# కల్తీకి కేరాఫ్ వైయస్ జగన్

## దొంగ పనులు చేసి దొర పలుకులా - ఎమ్మెల్సీ ఆలపాటి



**తెనాలి, మేజర్ న్యూస్:** కల్తీ కి కేరాఫ్ అడ్రస్ వైయస్ జగన్ అని శాసనమండలి సభ్యులు అలపాటి రాజేంద్రప్రసాద్ విమర్శించారు. స్థానిక పద్మావతి సమేత వైకుంఠపురం దేవస్థానంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవుడి ఫలహారాన్ని పాలకులే కలుషితం చేసి ప్రజల ఆగ్రహానికి గురైన వైయస్ జగన్ ను ఎట్టి పరిస్థితులలో కూడా క్షమించరని అన్నారు. గత ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కొట్లాది రూపాయల వ్యయంతో నెయ్యి కొనుగోలు చేసి కల్తీ నెయ్యి తయారుచేసి ఫలహారాన్ని ప్రజలకు అందించిన నీచ మనస్కుడు జగన్ అని ఆరోపించారు. తప్పు చేసిన వారు కొందరు సిగ్గు పడతారని, రాక్షస కుటుంబంలో పుట్టిన జగన్ సిగ్గు లేకుండా బయట తిరుగుతున్నారని విమర్శించారు. దొంగ పనులు చేసి దొరల తిరుగుతున్న జగన్ కు ప్రజలు బుద్ధి చెప్పారని అన్నారు. మానవత్వం లేకుండా నెయ్యిలో మధ్యలో కల్తీ కలిపి వేల కోట్లు దోచుకున్నారని, జగన్ విధానంలో ఆలోచనలో ప్రతి అంశంలో కల్తీ కనపడుతుందని ఎద్దేవా చేశారు. కల్తీ మద్యం అమ్మకాలు జరిపి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడిన కీచకుడు జగన్ అని ఆరోపించారు. నీతి అంటే తెలియని అవినీతి జగన్ దేవుని సొమ్ము దోచుకునేందుకు కూడా రాజీ పడలేదని, పరకామణి విషయంలో వారు ప్రవర్తించిన తీరు అందుకు నిదర్శనమని విమర్శించారు. భిన్నత్వంలో ఏకత్వం కలిగిన మన ప్రాంతంలో మతాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం జగన్ చేశారని ఆరోపించారు. పంచ భూతాలను దోచుకోవడానికి మానవ రూపంలో వచ్చిన నరరూప రాక్షసుడు వైయస్ జగన్ అని విమర్శించారు. ఇప్పటికైనా ప్రచ్ఛాతాప్తం లేని జగన్ పిచ్చి మాటలు మాట్లాడడం మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు జొన్నాదుల మహేష్, కౌన్సిలర్లు దివి అనిత, తాడిబోయిన బ్రహ్మేశ్వర రావు, పట్టణ టిడిపి అధ్యక్షులు మహమ్మద్ ఖుద్దూస్, పలువురు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### దాచేపల్లి పోలీసు స్టేషన్ లో మహిళ ఆత్మహత్యాయత్నం



పురుగుమందు తాగిన మహిళ

**దాచేపల్లి, మేజర్ న్యూస్ :** పల్నాడు జిల్లా దాచేపల్లి పోలీసు స్టేషన్ లో ఓ మహిళ పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన దాచేపల్లి మండలం లో కలకలం రేపింది.మండలం లోని భట్రుపాలెం గ్రామానికి చెందిన షేక్ రిజ్వానా అనే మహిళ తన కోడలు,వారి బంధువులు కలిసి అస్తి కోసం తన పై దాడి చేశారని, వారిపై పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేసి 20 రోజుల నుండి పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్నానని, తన ఫిర్యాదు ను పట్టించుకోక పోగా సిఐ భాస్కర్ అసభ్య పదజాలంతో దూషిస్తూ తన ను బయటకు గెంటి వేశారని, మనస్తాపం తో పోలీస్ స్టేషన్ ఆవరణలోనే పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డానని భాధిత మహిళ ఆరోపించింది.పోలీస్ స్టేషన్ లో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ ను స్టేషన్ లోని మహిళ పోలీసులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

### శాసనసభ్యులుయరపతినేని శ్రీనివాసరావు కు వినతి పత్రం అందించిన సిపిఐ పార్టీ పిడుగురాళ్ల శాఖ

**పిడుగురాళ్ల మేజర్ న్యూస్ :** మండలంలోని ఆదర్శనగర్ లో నెలకొన్న అనేక సమస్యలు పరిష్కారం కోసం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రం రూపంలో ఎమ్మెల్యే కి విన్నవించిన సిపిఐ పార్టీ పిడుగురాళ్ల శాఖ, స్థానిక ఆదర్శనగర్ కాలనీలో ఉన్నటువంటి రోడ్లు నీటి వసతి, ఓటర్, ఆధార్,రేషన్ అనేక సమస్యలను దృష్టిలో ఉంచుకొని యరపతినేని శ్రీనివాసరావు ని ఆదర్శనగర్ ను ఒకసారి సందర్శించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరడమైనది. వారు సానుకూలంగా సంస్పందించి ఫిబ్రవరి మొదటి వారంలో ఆదర్శనగర్ కు వస్తానని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సి పి ఐ పార్టీ మండల కార్యదర్శి అక్కినపల్లి బాలయ్య, ఆదర్శనగర్ కార్యదర్శి ఏలే వెంకటరమణ, కమిటీ సభ్యులు ఆలకొండ శ్రీనివాసరావు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

### నేడు 75 తాళ్లూరులో కోదండరామస్వామి పట్టాభిషేకం



**పెద్దకూరపాడు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని 75 తాళ్లూరులో కొలువు దీరిన కోదండరామస్వామి 100 సంవత్సరాలు పురస్కరించుకొని ఈనెల 30వ తేదీ నుండి ఒకటో తేదీ వరకు వేదమంత్రాలు,మంగళ వాయిద్యాలు నడుమున అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు. అనంతరం గణపతి పూజతో ప్రారంభించి మూడు రోజులు పాటు ప్రత్యేక హోమాలు,అభిషేకాలు శ్రీ కోదండరామ స్వామి పట్టాభిషేకం, కళ్యాణము భక్తి శ్రద్ధతో నిర్వయిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొని భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులవ్వాలని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

## రాష్ట్రస్థాయి ఎడ్లబల ప్రదర్శన పోటీలు ప్రారంభించిన ఎమ్మెల్యే యరపతినేని

### - పల్నాడులో మొర్జంపాడు తిరణాలకు ప్రత్యేకత



**మాచవరం ,మేజర్ న్యూస్:** పల్నాడు జిల్లా, గురజాల నియోజకవర్గం, మాచవరం మండలం మోర్జంపాడు గ్రామం నందు కొలువైయున్న "శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి 70వ కళ్యాణోత్సవం సందర్భంగా" నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు పాల్గొనటం జరిగింది. అనంతరం తిరునాళ్ల సందర్భంగా మోర్జంపాడు గ్రామం నందు రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఎడ్ల బలప్రదర్శన (ఎడ్ల బండలాగుడు) పందాలను కొబ్బరికాయ కొట్టి యరపతినేని శ్రీనివాసరావు ప్రారంభించటం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ బడిగుంచల వెంకటేశ్వర్లు, రాష్ట్ర పశుపోషక సంఘం అధ్యక్షులు ఎల్లం సాంబశివరావు, తంగెడ రామకృష్ణారావు కరణం మొర్జంపాడు, శ్రీ లక్ష్మి నరసింహ స్వామి సేవా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్.లక్ష్మినారాయణ, రీజనల్ మేనేజర్, ఫోన్ నెం. 63011 07116